మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

శుక్రవారం
FRIDAY
5-12-2025


జగిత్యాల JAGITIAL || పేజీలు: 8 PAGES:8 || వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 || సంచిక: 156 Issue: 156

Published from Jagitial
www.evarthalu.com

05 డిసెంబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు మార్గశిర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:36 సూర్యాస్తమయం - సా. 5:37 తిథిః పాడ్యమి రా. 12:57o వరకు తరువాత విదియ సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం రోహిణి ఉ. 11:46 వరకు తరువాత మృగశిర యోగం సిద్ధ ఉ. 8:02 వరకు కరణం భాలవ మ. 2:50 వరకు కౌలవ రా. 12:57o వరకు వర్జ్యం సా. 4:40 నుండి సా. 6:04 వరకు దుర్ముహూర్తం ఉ. 8:48 నుండి ఉ. 9:32 వరకు మ. 12:28 నుండి మ. 1:12 వరకు రాహుకాలం ఉ. 10:44 నుండి మ. 12:06 వరకు యమగండం మ. 2:51 నుండి సా. 4:14 వరకు గుళికాకాలం ఉ. 7:58 నుండి ఉ. 9:21 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:00 నుండి తె. 5:48 వరకు అమృత ఘడియలు ఉ. 8:58 నుండి ఉ. 10:21 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:44 నుండి మ. 12:28 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

"తెలంగాణ పల్లెల్లో ఏం నడుస్తోంది.. అంటే ఎవర్ని అడిగినా ఇట్స్ పార్టీ టైం అంటున్నారు. స్థానిక సమరం రసవత్తరంగా, ఖరీదైన వ్యవహారంగా మారింది. సాయంత్రం అయితే చాలు, మామిడి తోటలు, పొలాల గట్లపై దావత్‌లు జోరందుకుంటున్నాయి. సర్పంచ్ పదవి కోసం పోటీపడుతున్న అభ్యర్థులు లక్షలు ఖర్చుపెడుతూ, ఓటును కొనుగోలు చేసేందుకు వెనుకాడటం లేదు. మద్యం ఏరులై పారుతోంది. చికెన్, మటన్ స్టఫ్‌తో ఓటర్లను ఆకర్షిస్తున్నారు."


# ఇట్స్ పార్టీ టైం
PARTY TIME



## మధ్యాహ్నం దాకా బిర్యానీ పార్టీలు
## సాయంత్రమైతే మందు దావత్‌లు
## మద్యం, స్టఫ్.. ఓటర్లకు ఫ్రీ ఫ్రీ ఫ్రీ
## మందు తాగనోళ్లకు పైసల పంపిణీ
## సర్పంచ్ అభ్యర్థులకు మోపెడు ఖర్చు

(ఈవార్తలు ప్రత్యేకం)

ఎన్నికల పోలింగ్ తేదీలు దగ్గరపడుతున్న కొద్దీ, పల్లెల్లో రాజకీయం వేడెక్కుతోంది. సర్పంచ్ అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి విందులు, వినోదాలు, మద్యం, మాంసాహారంతో కోలాహలం సృష్టిస్తున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ, గ్రామాల్లో బాహాటంగానే మందు పార్టీలు జరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నవంబర్ 25 నుంచే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. రాష్ట్ర ఎన్నికల సంఘం -2 వ పేజీలో...




# 87 లోన్ యాప్స్ బ్యాన్

న్యూఢిల్లీ: చట్టవిరుద్ధ కార్యకలాపాలతో ప్రజలను వేధిస్తూ, సైబర్ మోసాలు, డేటా దుర్వినియోగం, అధిక వడ్డీ దోపిడీలకు పాల్పడుతున్న 87 అనధికార డిజిటల్ లోన్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర చర్యలు తీసుకుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, 2000లోని సెక్షన్ 69ఏ ప్రకారం ఈ యాప్‌లను బ్లాక్ చేసినట్లు మంత్రి ఆఫ్ స్టేట్ -2 వ పేజీలో...



# అఖండ 2 విడుదల క్యాన్సిల్

## నిర్మాతల సంచలన ప్రకటన

హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): బాలయ్య నటించిన అఖండ 2 సినిమా రిలీజ్ అనూహ్యంగా వాయిదా పడింది. అంతకుముందు గురువారం రాత్రి ప్లాన్ చేసిన అఖండ 2 ప్రీమియర్స్ రద్దు కాగా, రెగ్యులర్ షోలను కూడా వాయిదా వేశారు. సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు అర్ధరాత్రి -2 వ పేజీలో...



# మురిసిన చందమామ.. మెరిసిన భూమాత

చందమామ రావే.. జాబిల్లి రావే.. అంటే కనీసం దగ్గరి వరకైనా చందమామ రాలేదు. కానీ, గురువారం నిండు పున్నమిలో అతి దగ్గరగా దర్శనమిచ్చి 'సూపర్' అనిపించాడు. సాధారణంగా చంద్రుడు భూమి నుంచి సుమారు 3,84,000 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కానీ సూపర్ మూన్ సమయంలో అది 3,57,000 కిలోమీటర్ల వరకు సమీపంగా వస్తుంది. ఆసియా, యూరప్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా ఖండాల్లో సూపర్ మూన్ అత్యంత స్పష్టంగా కనిపించింది. సూర్యాస్తమయం తర్వాత సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్, చెన్నైలో పెద్దదిగా కనువిందుచ చేసింది. ఈ కోల్డ్ సూపర్ మూన్ సాధారణ పౌర్ణమి కంటే 14 శాతం పెద్దదిగా, 30 శాతం ప్రకాశవంతంగా కనిపించింది. ఇలాంటి సూపర్ మూన్ మళ్లీ 2042లోనే దర్శనం ఇవ్వనుంది.



# పుతిన్ వచ్చేశాడు!

## ఘనస్వాగతం పలికిన మోదీ.. ఒకే కారులో మోదీ-పుతిన్

రెండు రోజుల పర్యటన కోసం భారత్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఘనస్వాగతం లభించింది. పాలెం ఎయిర్ పోర్టులో ప్రధాని నరేంద్ర మోదీ ప్రోటోకాల్ పక్కనబెట్టి పుతిన్‌కు స్వాగతం పలికారు. అనంతరం ఢిల్లీ విమానాశ్రయం నుంచి బయలుదేరేటప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్ ఇద్దరూ ఒకే కారులో ప్రయాణించారు.

న్యూఢిల్లీ: ఇద్దరు ప్రపంచ నాయకులు ఇలా కలిసి ప్రయాణించడం అనేది భారత్-రష్యా స్నేహబంధం ఎంత బలంగా ఉందో చెప్పకనే చెబుతోంది. ఇద్దరు నాయకులు ఒకే వాహనంలో ప్రయాణించడం ఇదే మొదటిసారి కాదు. ఇది ఇద్దరు నాయకుల మధ్య వ్యక్తిగత బంధాన్ని, దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాన్ని సూచిస్తుంది. సెప్టెంబర్‌లో చైనాలో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సమావేశం సందర్భంగా కూడా మోదీ, పుతిన్ ఒకే వాహనంలో ప్రయాణించారు. ఆ సమయంలో అమెరికా భారత్‌పై భారీగా టారిఫ్స్ విధించింది. అటువంటి తరుణంలో మోదీ-పుతిన్ ఒకే కారులో వెళ్లడం.. ప్రపంచ దేశాలకు సరికొత్త సంకేతాన్ని పంపించినట్లు అయ్యింది. మరోవైపు, పుతిన్ భారత పర్యటనను ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. పుతిన్ విమానం ఢిల్లీలో ల్యాండ్ కావడానికి ముందు ప్రముఖ ఫ్లైట్ ట్రాకింగ్ తరువాయి 2 వ పేజీలో...

# 340 శాతం లాభం!

## గ్రాముపై రూ.10 వేల ప్రాఫిట్

### సావరిన్ గోల్డ్ బాండ్స్‌తో భారీ రిటర్న్స్




న్యూఢిల్లీ: సావరిన్ గోల్డ్ బాండ్స్ ఇన్వెస్టర్లకు కాసుల పంట పండిస్తున్నాయి. రోజురోజుకూ ధరలు రికార్డు గరిష్టాలకు చేరుతున్న క్రమంలో ఈ గోల్డ్ బాండ్స్ పెట్టుబడిదారులు పండగ చేసుకుంటున్నారు. తాజాగా, సావరిన్ గోల్డ్ బాండ్ 2017-18 సిరీస్ ఎక్స్ గోల్డ్ బాండ్ ధరల్ని ప్రకటించింది. 2017, డిసెంబర్ 4న ఈ గోల్డ్ బాండ్లను ఇష్యూ చేయగా.. ఇప్పుడు 2025, డిసెంబర్ 4 నుంచి రిడీమ్ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తోంది. ఈ మేరకు.. డిసెంబర్ 3న ఆర్బీఐ తరువాయి 2 వ పేజీలో...

# దిగ్గజ నిర్మాత ఏవీఎం శరవణన్ కన్నుమూత



దిగ్గజ నిర్మాత ఏవీఎం శరవణన్ (85) కన్నుమూశారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో చెన్నైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. తమిళంతో పాటు తెలుగు, మలయాళంలో చిత్రాలు నిర్మించారాయన. ఎంజీఆర్, శివాజీ, జెమిని గణేశన్, రజనీకాంత్, కమల్ హాసన్‌లతో వంటి లెజెండరీలు.. విక్రమ్, రానాలాంటి తారలు ఈ ప్రతిష్టాత్మక బ్యానర్‌లో నటించారు.



# ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తెస్తా

## మాకు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

### రాష్ట్ర పురోభివృద్ధికి కృషి చేస్తున్నాం.. ఆదిలాబాద్ సభలో సీఎం రేవంత్

ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్ తెస్తానని సీఎం రేవంత్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన 'ప్రజా పాలన విజయోత్సవాల' సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా.. సంక్షేమం-అభివృద్ధి అనే రెండు కళ్లతో రాష్ట్ర పురోగతికి కృషి చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

ఆదిలాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): చిన్న వయసులోనే ప్రజలు తనకు ఇంతటి గొప్ప అవకాశం ఇచ్చారని, వారి నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయబోమని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గత పదేళ్ల పాలనలో నిరంకుశత్వం రాజ్యమేలిందని.. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కనీసం ప్రభుత్వ కార్యక్రమాలకు, సచివాలయానికి కూడా రానివ్వలేదని సీఎం గుర్తు చేశారు. ఈ ధోరణిని ప్రజలు గమనించి.. ఓటును ఆయుధంగా మార్చి ఆ ప్రభుత్వాన్ని కూల్చి.. ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారని అన్నారు. తమ ప్రభుత్వం మాత్రం రాజకీయాలకు అతీతంగా పనిచేస్తుందని.. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,966 |
| వెండి (గ్రాము): | రూ.200 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,813 |

## విశ్వవాణి



దక్షిణ కొరియాలో ఏమీ చేయకపోవడం కూడా ఒక ఆటేనట. ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఆటలో యువతీ యువకులు 90 నిమిషాల పాటు ఫోన్లు లేకుండా, మాట్లాడకుండా, నిద్రపోకుండా, చిల్ మూడ్‌లో ఉండాలి. ఒకప్పుడు ఇది సాధ్యమయ్యేదేమో గానీ.. ఇప్పుడు 90 నిమిషాల పాటు ఫోన్ పట్టుకోకుండా ఉండటం అంటే మామూలు ఆట కాదది. గుండె ధైర్యం ఉండాలిగా..!

# హిడ్మాకు 3 రోజులు చిత్రహింసలు

మావోయిస్టు అగ్రనేత మాడ్వీ హిడ్మా ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సంచలన లేఖ విడుదల చేసింది. అందులో, వైద్యం కోసం విజయవాజ వచ్చిన హిడ్మాను అరెస్ట్ చేసి.. మూడు రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి ఆ తర్వాత మారేడుమిల్లిలో బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని ఆరోపణలు గుప్పించింది.

## విజయవాడకు వైద్యం కోసం వచ్చిన మాడ్వీ

### నిరాయుధుడిని అరెస్టు చేసి హింసించారు... మావోయిస్టు పార్టీ సంచలన లేఖ

రాయ్‌పూర్: ఇది కేంద్ర హెూం మంత్రి అమి షా ఆధ్వర్యంలో జరిగిందని మావోయిస్టు పార్టీ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అంతేకాకుండా హిడ్మా హత్యలో దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి హస్తం ఉందన్న ఆరోపణలను ఖండించింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీ మాడ్వి హిడ్మాతో పాటు మరో ఐదుగురు, ఏవోబీ ఎస్‌జడ్‌సీ సభ్యుడు శంకర్‌ది ముమ్మాటికీ హత్య అని ఆరోపించింది. హిడ్మా నవంబర్ 15న చికిత్స కోసం విజయవాడకు తరువాయి 2 వ పేజీలో...



# రాశి ఫలాలు

3.12.2025

మేషం: దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. సంతాన విద్యా విషయాలపై దృష్టి సారించాలి. తల్లి తరపు బంధు వర్గంతో వివాదాలు కలుగుతాయి. చేపట్టిన మందకోడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

వృషభం: అన్నివైపుల నుండి ఆదాయం అందుతుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఇంటా బయట సంతోషకర వాతావరణం ఉంటుంది. సోదరులతో సఖ్యత కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మిధునం: అనవసర వస్తువులపై ధన వ్యయం చేస్తారు. గృహమునకు కొందరి ప్రవర్తన మానసిక ఆందోళన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో సరైన నిర్ణయం తీసుకోలేరు. ఇతరులతో వివాదాలకు దూరంగా ఉ ౦డటం మంచిది.

కర్కాటకం: ఉద్యోగమున నూతన అవకాశములు అందుతాయి. చేపట్టిన పనులలో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటారు. నిరుద్యోగుల కష్టం ఫలించిన నూతన అవకాశాలు అందుతాయి. ఇంటా బయట మంచి మాట తీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. ఆర్థిక పరిస్థితి ఆశించిన రీతిలో ఉంటుంది.

సింహం: భాగస్వామ్య వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి ఉద్యోగాలలో మీ శ్రమకు తగిన గుర్తింపు లభించదు. ఆర్థికంగా కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

కన్య: కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో కొన్ని పనులను పూర్తి చేస్తారు. ఋణ సమస్యల నుండి బయటపడతారు. వృత్తి, ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి.

తుల: పాత రుణాలు తీర్చగలుగుతారు. బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. చేపట్టిన పనులలో అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తిచేస్తారు. ఆదాయ మార్గాలు మెరుగుపడతాయి.

వృశ్చికం: వృత్తి ఉద్యోగాలలో మేలైన సౌకర్యాలను పొందుతారు. సమాజంలో కీర్తి గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సంతానం విద్యా విషయాలపై కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు విశేషంగా పాల్గొంటారు.

ధనస్సు: బంధు మిత్రులతో చిన్నపాటి మాటపట్టింపులు ఉ ంటాయి. శారీరక మానసిక ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇతరులపై మీ ఆలోచనా విధానం మార్చుకోవడం మంచిది. అనుకున్న సమయానికి పనులు పూర్తికావు.

మకరం: ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. విలువైన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. భూ క్రయవిక్రయాలలో నూతన లాభాలు అందుతాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు.

కుంభం: ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. వ్యాపార వ్యవహారాలలో పెద్దల సలహాలను తీసుకుని ముందుకు సాగడం మంచిది. సంతాన విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది.

మీనం: దీర్ఘ కాలిక అనారోగ్య సమస్యలు కొంత బాధిస్తాయి. పనులు మధ్యలో నిలిచిపోతాయి. ఉద్యోగ వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. ధన విషయాలలో ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది.





# ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తెస్తా

మొదటి పేజీ తరువాయి

ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ అభివృద్ధికి తానే బాధ్యత వహిస్తానని సీఎం ప్రకటించారు.ఆదిలాబాద్ ప్రజలకు అత్యంత ముఖ్యమైన శుభవార్తను ప్రకటిస్తూ.. ఏడాది తిరిగే లోపు జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. 'ఆదిలాబాద్‌కు ఎర్రబస్సులు కాదు.. ఎయిర్ బస్సును తీసుకొస్తా' అని ఆయన ప్రజలకు మాటిచ్చారు. అటు.. గత ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం ప్రజా ధనాన్ని లూటీ చేసిందని.. కాళేశ్వరం పేరుతో ప్రాజెక్టును నిర్మిస్తే అది కూలేశ్వరం అయ్యిందని ఎద్దేవా చేశారు. ఆ ప్రాజెక్టు కేవలం కొందరి ఇళ్లలో మాత్రం కాసులు కురిపించిందని ఆరోపించారు. కేవలం కమీషన్లు దండుకోవడం కోసమే ఆ ప్రాజెక్టును నిర్మించి.. వేల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. సోనియా గాంధీ ఏ ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారో.. దానికి భిన్నంగా గత పదేళ్ల పాలన సాగిందని మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్ – 2047' డాక్యుమెంటరీని రూపొందించినట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులు సాధించే లక్ష్యంతో ఈ నెల 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో మళ్లీ ఆదిలాబాద్‌కు వచ్చి ఒక రోజంతా ఇక్కడే ఉండి.. సమీక్షలు నిర్వహించి, అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించి పోతానని హామీ ఇచ్చారు.

# 87 లోన్ యాప్స్ బ్యాన్

మొదటి పేజీ తరువాయి

ఫర్ కార్పొరేట్ అఫైర్స్ హర్ష్ మల్హోత్రా లోక్‌సభలో తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐటీ మంత్రిత్వ శాఖ కలిసి చేపట్టిన సమగ్ర సమీక్ష అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. డిజిటల్ లెండింగ్ ప్లాట్‌ఫామ్‌లపై పర్యవేక్షణను మరింత కఠినతరం చేయాలని కేంద్రం నిర్ణయించింది. గత కొన్ని సంవత్సరాలుగా డిజిటల్ లోన్ యాప్‌లు ప్రజలను లక్ష్యంగా చేసుకుని అనధికార కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటి ద్వారా అధిక వడ్డీలు వసూలు చేసుకోవడం, రుణాలు తిరిగి చెల్లించకపోతే బాధితుల కుటుంబ సభ్యులను వేధించడం, వ్యక్తిగత డేటాను దుర్వినియోగం చేయడం వంటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఈ యాప్‌లు %=దీ×% మార్గదర్శకాలను పాటించకుండా, ఆక్రమణాత్మక రికవరీ పద్ధతులు అనుసరిస్తున్నాయి. ఫిర్యాదులు పెరగడంతో కేంద్రం సమగ్ర సమీక్ష చేపట్టింది. 2024లోనే ఆర్బీఐ, కేంద్రంతో కలిసి 665 చైనీస్ లోన్ యాప్‌లపై విచారణ ప్రారంభించాయి. ఈ యాప్‌లు ప్రజల ఫోటోలు, కాంటాక్ట్ లిస్ట్‌లను మోసపూరితంగా సేకరించి, రుణాలు చెల్లించకపోతే బెదిరింపులు చేస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలతో కేంద్రం ఈ చర్యలు తీసుకుంది. ఆర్బీఐ డిజిటల్ లెండింగ్ మార్గదర్శకాలు (2022) ప్రకారం, అన్ని లోన్ యాప్‌లు అనుమతి పొందాలి. కానీ ఈ 87 యాప్‌లు ఈ నిబంధనలను ఉల్లంఘించాయి. దీంతో వేటు పడింది. ఈ యాప్‌లకు బాకీ ఉన్నవారు ఇక కట్టాల్సిన అవసరం ఉండదు. యాప్స్‌ను బ్లాక్ చేశారు కాబట్టి కమ్యూనికేషన్ కూడా ఉండదు.

# ఇట్స్ పార్టీ టైం

మొదటి పేజీ తరువాయి

చర్యలు తీసుకుంటున్నా, గ్రామస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. సర్పంచ్ పదవికి రాజకీయ పార్టీల చిహ్నాలు లేనప్పటికీ, ప్రధాన పార్టీల మద్దతుదారులు బరిలో దిగడంతో రాజకీయం తారస్థాయికి చేరింది. గ్రామాల్లో సర్పంచ్ ఎన్నిక అంటే ఆషామాషీ కాదు. ఇది ప్రతిష్టాత్మక పోరు. అభ్యర్థులు తమ బలం, బలగం చూపించుకోవడానికి విందులను ఆయుధంగా వాడుకుంటున్నారు. ముఖ్యంగా, నామినేషన్ల ప్రక్రియ ముగిసి, గుర్తుల కేటాయింపు జరిగిన తర్వాత ఈ 'పార్టీ'ల సంస్కృతి పతాక స్థాయికి చేరుకుంది. బహిరంగ ప్రదేశాల్లో ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండటంతో, అభ్యర్థులు తెలివిగా వ్యవహరిస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా తమ మామిడి తోటలు, పొలాలు, లేదంటే ఊరికి దూరంగా ఉన్న ఫామ్‌హౌస్‌లను విందులకు వేదికలుగా చేసుకుంటున్నారు. విందుల్లో చికెన్, మటన్, చేపలు కామన్‌గా మారిపోయాయి. వీటితో పాటు మద్యం బాటిళ్లు ఇతర స్టఫ్ సమకూరుస్తున్నారు. ఓటర్లను తమవైపు తిప్పుకోవడానికి ఏ ఖర్చుకైనా వెనుకాడడం లేదు. కేవలం విందులే కాకుండా, ఓటుకు కొంత మొత్తం పంపిణీ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు అక్కడక్కడ తనిఖీలు చేసి, మద్యం పట్టుకుంటున్నా, అభ్యర్థులు కొత్త దారులు వెతుకుతున్నారు. అధికార పార్టీ నేతలు కూడా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ ప్రచారం చేస్తున్నారని ప్రతిపక్షాలు ఫిర్యాదులు చేస్తున్నాయి. అయితే, సర్పంచులు పదవి కోసం లక్షలు, కోట్లు ఖర్చు చేయడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో నిధులు రాక అప్పులపాలై కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా చర్చకు వస్తున్నాయి. కాగా, డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు దశల్లో పోలింగ్ జరగనుంది, అదే రోజు సాయంత్రానికి ఫలితాలు వెల్లడికానున్నాయి.



## పుతిన్ వచ్చేశాడు!

మొదటి పేజీ తరువాయి

వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్ 24 ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. ప్రపంచంలోనే అత్యధికంగా ట్రాక్ చేయబడిన విమానంగా పుతిన్ విమానం నమోదైందని పేర్కొంది.

### భగవద్గీత బహూకరణ

రష్యన్ భాషలోకి అనువదించిన భగవద్గీత పుస్తకాన్ని పుతిన్‌కు మోదీ అందజేశారు. దీనికి సంబంధించిన ఫొటోను ప్రధాని మోదీ ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా కోట్ల మందికి స్ఫూర్తినిచ్చిన పుస్తకం భగవద్గీత అని పేర్కొన్నారు.

# హిడ్మాకు 3 రోజులు చిత్రహింసలు

మొదటి పేజీ తరువాయి

వచ్చిన సమయంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారని పేర్కొంది. ఆ తర్వాత మూడు రోజుల పాటు చిత్రహింసల కు గురిచేశారని.. అనంతరం నవంబర్ 18న హిడ్మాతో పాటు ఆయన అనుచరులను ఎవరికీ అనుమానం రాకుండా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారెడుమిల్లి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి ఏపీ పోలీసులు హతమార్చారని సంచలన ఆరోపణలు చేసింది. అలాగే నవంబర్ 19న రంపచోడ వరంలో శంకర్‌తో సహా మరో 6 మందిని హత్యచేశారని మావోయిస్టు పార్టీ చెప్పింది. మొత్తం 13 మంది మావోయిస్టులు హతమ య్యారు, 50 మందిని అరెస్టు చేశారని పేర్కొంది. అరెస్ట్ అయిన వారిలో మావోయి స్టు పార్టీ అగ్ర నేతలు దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి లేరని క్లారిటీ ఇచ్చింది. ఇది వరకే లొంగిపో యిన పార్టీ సభ్యుడు కుసాల్ హిడ్మా కదలిక లపై పోలీసులకు సమాచారం ఇచ్చాడని చెప్పింది. అంతేకాకుండా విజయవాడకు చెందిన ఓ కలప వ్యాపారి, ఫర్నిచర్ వ్యాపారి, బిల్డర్‌తో పాటు అల్లూరి జిల్లాలో ఐటీడీఏ కాంట్రాక్టర్లు ఇందులో కీలక పాత్ర పోషిం చారని ఆరోపించింది. ఇది ఏపీ పోలీసులు చేసింది కాదని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఇంటెలిజెన్స్ ఏజెన్సీల జాయింట్ ఆపరేషన్ అని, దీనికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూత్రధారి ఆరోపణలు గుప్పించింది. హిడ్మా హత్యతో పార్టీ అగ్రనేత దేవ్‌జీకి కారణమనే ఆరోపణలను మావోయిస్టు పార్టీ ఖండించింది. దేవ్ జీ పోలీసులతో ఒప్పందం చేసుకుని మావోయిస్టులకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చారనేది అవాస్తవమని చెప్పింది. పోరాట వీరుడిపై నిందలు వేస్తున్నారని చెప్పింది. మావోయిస్టు పార్టీపై కుట్రలో భాగంగానే ఇలా చేస్తున్నారని మండిపడింది. అంతేకాకుండా భారత్‌ను కార్పొరేట్ హిందూ దేశంగా మార్చాలని.. బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆరెస్సెస్–బీజేపీ ప్రభుత్వాలు కగార్ యుద్ధం సాగిస్తున్నాయని సంచలన వ్యాఖ్యలు చేసింది. మావోయిస్టు పార్టీ సభ్యుల హత్యలపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని, దోషులను శిక్షించాలని డిమాండ్ చేసింది.

# 340% లాభం!

మొదటి పేజీ తరువాయి

ఒక సర్క్యులర్‌లో ప్రకటించింది. ఈ గోల్డ్ బాండ్ సిరీస్ సబ్‌స్క్రిప్షన్ 2017 నవంబర్ 27–29 మధ్య జరిగింది. అప్పట్లో గ్రాము బంగారం ధర లేదా యూనిట్ గోల్డ్ బాండ్ ఇష్యూ ప్రైస్ రూ.2,961 గా నిర్ణయించింది. డిజిటల్ విధానంలో పేమెంట్ చేస్తే గ్రాముపై రూ.50 డిస్కౌంట్ లభించింది. అంటే గ్రాముకు రూ. 2,911 కే వచ్చిందన్నమాట. ఇప్పుడు రిడెంప్షన్ తేదీకి 3 రోజుల ముందు సగటు ధర ఆధారంగాఆర్బీఐ గోల్డ్ బాండ్ విమోచన ధర (రిడెంప్షన్ ప్రైస్) ప్రకటించింది. ఇప్పుడు గ్రాముకు రూ. 12,820 గా నిర్ణయించింది. ఇక్కడ గ్రాముపైనే రూ. 12,820లో పెట్టుబడి (రూ.2,911) తీసేస్తే రూ.9,909 లాభం వచ్చింది. ఇది శాతం పరంగా చూస్తే 340 శాతంగా ఉ ంది. పైగా, గోల్డ్ బాండ్లపై వార్షిక ప్రాతిపదికన 2.50 శాతం చొప్పున వడ్డీ చెల్లిస్తుంటుంది. ఇది కలిపితే గ్రాముపైనే రూ.10 వేలకుపైగా లాభం వచ్చింది. ఇష్యూ చేసిన సమయంలో రూ.1 లక్ష ఇన్వెస్ట్ చేసిన వారికి ఇప్పుడు రూ.4.50 లక్షల వరకు అందనున్నాయి.

# దిగ్గజ నిర్మాత ఏవీఎం శరవణన్ కన్నుమూత

చెన్నై: దిగ్గజ నిర్మాత ఏవీఎం శరవణన్ (85) కన్నుమూశారు. వయో భారం, అనారోగ్య సమస్యలతో చెన్నైలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. తమిళంతో పాటు తెలుగు, మలయాళంలో చిత్రాలు నిర్మించారాయన. ఎంజీఆర్, శివాజీ, జెమిని గణేశన్, రజనీకాంత్, కమల్ హాసన్‌లతో వంటి లెజెండరీలు.. విక్రమ్, రానాలాంటి తారలు ఈ ప్రతిష్టాత్మక బ్యానర్‌లో నటించారు. ఏవీఎం అంటే అర్థం.. ఏవీ మేయప్పన్. ఆయన శరవణన్ తండ్రి. మద్రాస్ కేంద్రంగా ఈ బ్యానర్ తొలినాళ్లలో సరస్వతి సౌండ్ ప్రొడక్షన్స్‌గా.. ఆ తర్వాత ప్రగతి పిక్చర్స్ లిమిటెడ్, ప్రగతి స్టూడియోస్.. మేయప్పన్( ఏవీ మేయ్యప్ప చెట్టియార్) తన భాగస్వాములతో కలిసి నడిపించారు. 1945లో ఏవీఎం ప్రొడక్షన్స్‌గా మారింది. అప్పటి నుంచి ఈ బ్యానర్‌లో ఎన్నో గొప్ప చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. తండ్రి ఏవీ మేయప్పన్ తర్వాత శరవణన్ ఆ ప్రొడక్షన్ హౌజ్‌ను సమర్థంగా ముందుకు తీసుకెళ్లారు. వివిధ భాషల్లో 176 సినిమాలతో పాటు తెలుగు, తమిళ్, మలయాళంలో సీరియల్స్‌ను ఏవీఎం బ్యానర్‌లో నిర్మించారు. భూకైలాస్(1940), శివాజీ ది బాస్, మెరుపుకలలు, జెమినీ, లీడర్, సంసారం ఒక చదరం గం.. ఇలా ఎన్నో మరుపురాని హిట్స్ అందించారు. ఏవీఎం బ్యానర్‌లో వచ్చిన చివరి చిత్రం ఇదువు మ్ కదాందు పొగుమ్(2014). 2022లో అరుణ్ విజయ్ లీడ్ రోల్‌లో తమిళ్‌రాకర్స్ అనే వెబ్‌సిరీస్ కూడా నిర్మించారు. ఈయన కుమారుడు ఎమ్ఎస్ గుహాన్ కూడా నిర్మాతగా రాణిస్తున్నారు. శరవణన్ మృతి పట్ల పలువురు సినీప్రముఖులు సంతాపం తెలియజేశారు.

# అఖండ 2 విడుదల క్యాన్సిల్

మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియా వేదికగా 14 రీల్స్ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'అనివార్య కారణాల వల్ల అఖండ 2 షెడ్యూల్ ప్రకారం విడుదల కావడం లేదు. ఈ విషయం పట్ల ఏం ఎంతగానో చింతిస్తున్నాం. ఈ క్షణం మాకు చాలా బాధాకరమైనది. ప్రతి అభిమాని, సినీ ప్రేమికుడికి ఇది కలిగించే నిరాశను మేము అర్థం చేసుకుంటాం. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాం. ఈ నిర్ణయం పట్ల కలిగిన అసౌకర్యానికి మా హృదయపూర్వక క్షమాపణలు. ఈ సమయంలో మీ మద్దతు మాకు చాలా అవసరం. అతి త్వరలో సానుకూల నిర్ణయంతో మీ ముందుకు వస్తాం" అని నిర్మాణ సంస్థ పేర్కొంది.

# హైదరాబాద్ మహిళకు 3.3 లక్షలు టోకరా

## పెళ్లి పేరుతో మోసం చేసిన కేటుగాడు.. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు

హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): పెళ్లి చేసుకుంటానని ఆన్‌లైన్‌లో నమ్మించి ఓ మహిళ నుంచి రూ. 3.38 లక్షలు కాజేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. బ్రిటన్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నానంటూ పరిచయమైన ఓ వ్యక్తి, వాట్సాప్ చాటింగ్‌లు, వీడియో కాల్స్‌తో నమ్మకం కలిగించి ఈ మోసానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం, హిరాద్ అహ్మద్ అనే పేరుతో ఓ వ్యక్తి బాధితురాలిని సంప్రదించాడు. తాను బ్రిటన్‌లో వైద్యుడినని, త్వరలో పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని నమ్మబలికాడు. రోజూ వాట్సాప్‌లో మాట్లాడుతూ, వీడియో కాల్స్ చేస్తూ ఆమెకు దగ్గరయ్యాడు. ఈ క్రమంలో ఆమెను పూర్తిగా నమ్మించిన నిందితుడు, రెండు కొత్త బ్యాంకు ఖాతాలు తెరిచి, కొత్త సిమ్ కార్డులు తీసుకోవాలని సూచించాడు. ఆ తర్వాత, నకిలీ వీసా, పెళ్లి పత్రాలను పంపి, వివిధ అవసరాల పేరుతో డబ్బు డిమాండ్ చేయడం మొదలుపెట్టాడు. ప్రాసెసింగ్ ఫీజులు, వీసా ఆలస్యానికి పెనాల్టీలు, లగేజీ సమస్యలు, హోటల్ ఖర్చులు వంటి కట్టుకథలు చెప్పి విడతలవారీగా మొత్తం రూ. 3,38,200 తన ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. అంతటితో ఆగకుండా, ఆమె బ్యాంకు పాస్‌బుక్‌లు, ఏటీఎం కార్డులను ఢిల్లీలోని యూకే ఎఫైర్స్ ఆఫీసుకు పంపాలని కోరాడు. కొంతకాలానికి నిందితుడు స్పందించడం మానేయడంతో అనుమానం వచ్చిన మహిళ, తాను మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇలాంటి ఆన్‌లైన్ పెళ్లి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.



## అక్రమ సొమ్ము కోసం

# కేసీఆర్ ఇంట్లో లొల్లులు

**వారింట్లో పైసల పంచాయతీ తప్ప మరొకటి లేదు**

**నిధులు తెచ్చే వారినే సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలి**

**ప్రజలకు సీఎం రేవంత్ విజ్ఞప్తి**



హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు):బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఓ కుటుంబం ప్రజల సొమ్మును దోచుకుందని, ఇప్పుడు ఆ కుటుంబంలో అక్రమ సొమ్ము కోసం గొడవలు జరుగుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ లక్ష కోట్ల రూపాయలతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకే కూలేశ్వరంగా మారిందని ఎద్దేవా చేశారు. ఇప్పుడు బిడ్డ ఒక దిక్కు, కొడుకు ఒక దిక్కు, ఆయన ఎక్కడ పడుకున్నారో ఎవరికీ తెలియదని కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి అన్నారు. ప్రజలను దోచుకున్న వారు బాగుపడినట్లు చరిత్రలో లేదని మండిపడ్డారు. ఈ రోజు నడుస్తున్న చరిత్ర కూడా అదేనని అన్నారు. ఇప్పుడు వారింట్లో జరుగుతోంది పైసల పంచాయితీ తప్ప మరొకటి కాదని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్నాయని, మంత్రులతో మాట్లాడి గ్రామాలకు నిధులు తెచ్చే వారిని గెలిపించుకోండని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. గొడవలు సృష్టించే వారిని పక్కన పెట్టాలని అన్నారు. ఎన్నికల్లో కూడా అడ్డగోలుగా ఖర్చు పెట్టవద్దని, మీరు అలా ఖర్చు పెడితే అంత ఆదాయం కూడా రాదని అన్నారు. నిధులు ఇస్తామని, గ్రామాలను అభివృద్ధి చేసుకోండని సూచించారు. కేంద్రం వద్దకు తాము వెళ్లి నిధులు తెచ్చుకున్నట్లు, సర్పంచ్‌లు కూడా మంత్రుల వద్దకు వెళ్లి నిధులు తెచ్చుకోగలగాలని అన్నారు. మంచివారిని ఎన్నుకోండి.. నిధులిచ్చే బాధ్యత మాదే అన్నారు. విద్యార్థులు కూడా ఎన్నికలు అంటూ తిరగవద్దని, బాగా చదువుకుని, ఐపీఎస్, ఐఏఎస్, డాక్టర్లు కావాలని అన్నారు. అప్పుడే ఈ రేవంతన్న సంతోషంగా ఉంటాడని అన్నారు.

# అనుముల కాదు.. అవినీతి కొండ

## మేం వచ్చాక హిల్ట్ భూములు లాక్కుంటాం.. జీడిమెట్లలో రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు



జీడిమెట్ల/హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణానికి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రస్తుతం తక్కువ ధరకు విక్రయించిన భూములను వెనక్కి తీసుకుంటామని, సంబంధిత వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశ్రామిక భూముల బదలాయింపుపై ఆయన నేతృత్వంలోని బీఆర్ఎస్ నిజనిర్ధారణ బృందం జీడిమెట్ల పారిశ్రామిక పార్క్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, అనుముల రేవంత్ రెడ్డి కాదని, ఆయన అవినీతి అనకొండ అని విమర్శించారు. భూకుంభకోణంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల కోసం, పరిశ్రమల కోసం కేటాయించాల్సిన భూములను రేవంత్ రెడ్డి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను అమ్మి లక్షల కోట్ల రూపాయలు దోచుకుని ఆ సొమ్మును ఢిల్లీకి తరలించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఢిల్లీకి నిధులు తరలించే ప్రయత్నాలను బీఆర్ఎస్ అడ్డుకుంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. గజం ధర రూ.లక్షన్నర పలుకుతుంటే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.4,000కే అప్పగిస్తోందని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఒకచోట, హిల్ట్ పాలసీ పేరుతో మరొకచోట రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేరుతో పేదల గుడిసెలు కూల్చివేస్తున్నారని, కానీ పెద్దవాళ్లకు మాత్రం భూములు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు.



# శ్రీకాంతాచారి పేరేది?

## ఒక్క ప్రాజెక్టుకైనా అమరుడి పేరు పెట్టారా?

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నిలదీత**

హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి పేరును రాష్ట్రంలోని ఒక్క ప్రాజెక్టుకైనా పెట్టారా? అని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. అమరులను గౌరవిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఆ హామీని విస్మరించిందని ఆమె తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులకు రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ, మన్మోహన్ సింగ్ వంటి వారి పేర్లను పెడుతోందే తప్ప, తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన వారిని గుర్తించడం లేదని ఆరోపించారు. నిజమైన త్యాగాలు చేసిన తెలంగాణ బిడ్డల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోయేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కవిత అన్నారు. తెలంగాణ జాగృతి ఎల్లప్పుడూ అమరుల ఆశయ సాధన కోసం, వారి త్యాగాలను స్మరించుకోవడం కోసం పనిచేస్తుందని ఆమె స్పష్టం చేశారు.

## పాతబస్తీలో రియల్టర్

# దారుణ హత్య

పాతబస్తీ, డిసెంబర్ 4 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని పాతబస్తీలో ఒక దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి దారుణంగా హతమార్చారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు, వారు బాధితుడి బంధువులేనని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే..



రెయిన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహమ్మద్ జునైద్ (30) అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే జునైద్‌పై కొందరు వ్యక్తులు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న అతడిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు జునైద్‌ను సంతోష్‌నగర్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు మిర్చౌక్ ఏసీపీ శ్యామ్ సుందర్ వెల్లడించారు. నిందితులు, బాధితుడు ఇద్దరూ బంధువులేనని, హత్యకు గల కారణాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని ఆయన తెలిపారు. కుటుంబ కలహాలు లేదా వ్యాపార లావాదేవీలు ఈ హత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.



## ఎస్పీ బాలు దేశ సంపద: టీపీసీసీ చీఫ్

హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రాంగణంలో దివంగత గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఉంటే తప్పేమిటని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, కొణిజేటి రోశయ్య, ఎస్పీ బాలు ఒక ప్రాంతానికి చెందిన వారని అన్నారు. ఈ దేశానికి వారు ఒక సంపద అని వ్యాఖ్యానించారు. కాబట్టి బాలు విగ్రహాన్ని రవీంద్ర భారతిలో పెట్టడంలో తప్పేమి లేదని అన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌తో మరోసారి బీఆర్ఎస్ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. దేవుళ్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన సామెతను రాజకీయం చేయడం తగదని అన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీఆర్ఎస్ కోసమే పనిచేస్తున్నట్లున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిల్ట్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్) పాలసీ ద్వారా హైదరాబాద్ నగరంలో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులోకి వస్తాయని ఆయన అన్నారు. నగరం కూడా కాలుష్యరహితంగా మారుతుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతికి పాల్పడ్డారని, అందుకే తమ ప్రభుత్వం ఏం చేసినా కేసీఆర్ కుటుంబానికి అవినీతి మాదిరిగా కనిపిస్తోందని విమర్శించారు.



## ఎన్నికల్లో జోక్యం చేసుకోలేం: హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): తెలంగాణ ఎన్నికల ప్రక్రియలో భాగంగా, ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో జోక్యం చేసుకోలేమని రాష్ట్ర హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారణ జరిపిన హైకోర్టు, ఈరోజు తీర్పును వెలువరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్‌లలో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని ప్రాంతాల్లో సైతం ఆయా కులాలకు వార్డు మెంబర్లు, సర్పంచ్ రిజర్వేషన్లు కేటాయించారని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచ్ రిజర్వేషన్లు కేటాయించడంలో పొరపాట్లు జరిగాయని వారు పేర్కొన్నారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులాల వ్యక్తులు లేకపోతే ఎన్నికలు నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలియజేసింది. ఎన్నికల సంఘం చేసిన వాదనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. అనంతరం పిటిషన్లపై విచారణను ముగించింది.

## బాలుడిపై కుక్కల దాడి.. నివేదిక కోరిన హ్యూమన్ రైట్స్ కమిషన్

హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఎనిమిదేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. నగర శివారులోని హయత్ నగర్ శివగంగా కాలనీలో ప్రేమ్‌చంద్ అనే ఎనిమిదేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనకు సంబంధించి పలు దినపత్రికల్లో వచ్చిన కథనాలను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) కమిషనర్, జిల్లా కలెక్టర్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 29వ తేదీ లోపు నివేదిక ఇవ్వాలని పేర్కొంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు, బాలుడి ప్రస్తుత పరిస్థితి, కుక్కల స్టెరిలైజేషన్, నియంత్రణ చర్యల స్థితిగతులను నివేదికలో పేర్కొనాలని ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాల అమలు తీరుపై సమగ్ర నివేదిక అందజేయాలని కోరింది.

## రాచకొండ, సైబరాబాద్ పోలీస్ వెబ్‌సైట్లు హ్యాక్

హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): తెలంగాణ పోలీసులకు సైబర్ నేరగాళ్లు షాకిచ్చారు. ఇటీవలే హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన సైబర్ క్రిమినల్స్.. తాజాగా రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్లను పనిచేయకుండా చేశారు. దీంతో గత పది రోజులుగా రెండు కమిషనరేట్ల వెబ్‌సైట్లు పూర్తిగా నిలిచిపోయాయి. వీటిలోకి మాల్‌వేర్ చొరబడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వెబ్‌సైట్లను క్లిక్ చేస్తే అధికారిక సమాచారానికి బదులుగా గేమింగ్ సైట్లకు రీడైరెక్ట్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో సర్వర్లను డౌన్ చేసి వాటిని నిర్వహిస్తున్న ఎన్‌ఐసీకి సమాచారం అందించారు. సమస్యను పరిష్కరించేందుకు రెండు కమిషనరేట్లలోని ఐటీ బృందాలు యత్నిస్తున్నాయి. వెబ్‌సైట్ల పునరుద్ధరణకు ఎన్‌ఐసీ పర్యవేక్షణలో ప్రతినిధులు పనిచేస్తున్నారు. రెండు కమిషనరేట్ల పోలీస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నారు. మళ్లీ హ్యాకింగ్ కాకుండా అధునాతన ఫైర్‌వాల్స్ ఆడిట్ చేస్తున్నారు. ఆడిహ్యాకింగ్‌కు కారణమైన మూలాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేస్తూ సర్వర్‌ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, ఇదే తరహాలో పలు ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లు కూడా హ్యాక్ అయినట్లు సమాచారం. ఇప్పటికే డార్క్ వెబ్‌లో 22 వెబ్‌సైట్లకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉందని సైబర్ నిపులు చెబుతున్నారు.

## ప్రసారభారతి చైర్‌పర్సన్ సెహగల్ రాజీనామా

న్యూఢిల్లీ: ప్రసార భారతి బోర్డు చైర్‌పర్సన్‌గా మాజీ ఐఏఎస్ అధికారి నవనీత్ సెహగల్ పదవీకాలం ఉన్నప్పటికీ.. మధ్యలోనే ఆయన తప్పుకున్నారు. రెండు రోజుల క్రితం ఆయన సమర్పించిన రాజీనామాను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆమోదించింది. ప్రసారభారతి దేశవ్యాప్తంగా దూరదర్శన్ ప్రసారాలను, ఆకాశవాణి రేడియో సేవల్ని నిర్వహిస్తున్నది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి సెహెగల్‌ను కేంద్రం గత ఏడాది మార్చిలో చైర్‌పర్సన్‌గా నియమించింది.

## భారతీయుడికి 61 కోట్ల లాటరీ

సౌదీ: సౌదీ అరేబియాలో నివసిస్తున్న ఓ భారతీయుడిని అదృష్టం వరించింది. కేరళకు చెందిన పీవీ రాజన్, అబుదాబిలో నిర్వహించిన 'బిగ్ టికెట్' లక్కీ డ్రాలో ఏకంగా 25 మిలియన్ దిర్హామ్‌లు (భారత కరెన్సీలో సుమారు రూ.61.37 కోట్లు) గెలుచుకున్నారు. 15 సంవత్సరాలుగా లాటరీ టికెట్లు కొనుగోలు చేస్తున్న ఆయనకు ఎట్టకేలకు ఈ భారీ జాక్‌పాట్ తగిలింది. వివరాల్లోకి వెళ్తే, పీవీ రాజన్ నవంబర్ 9న 282824 నంబర్‌తో లాటరీ టికెట్‌ను కొనుగోలు చేశారు. తాజాగా నిర్వహించిన సిరీస్ 281 డ్రాలో ఆయన టికెట్‌కే మొదటి బహుమతి లభించింది. లాటరీ నిర్వాహకులు ఫోన్ చేసి ఈ శుభవార్తను అందించగా రాజన్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. తనకు చాలా సంతోషంగా ఉందని, ఈ ప్రైజ్ మనీని తాను ఒక్కడినే వుంచుకోనని, తన 15 మంది సహోద్యోగులతో సమానంగా పంచుకుంటానని ఆయన ఉదారంగా ప్రకటించారు. గత సిరీస్ విజేత, మరో భారతీయుడైన శరవణన్ చేతుల మీదుగా ఈ డ్రా తీయడం విశేషం. ఇదే డ్రాలో మరో 10 మంది కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారు. వీరికి తలా 10,000 దిర్హామ్‌లు (రూ.2.45 లక్షలు) లభించగా, వారిలోనూ ముగ్గురు భారతీయులు ఉండటం గమనార్హం. గల్ఫ్ దేశాల్లో భారతీయులకు లాటరీ తగలడం అన్నది ఇటీవల సాధారణమైపోయింది.

## స్కామర్‌నే బోల్తా కొట్టించాడు!

న్యూఢిల్లీ: ఆర్మీ అధికారిగా నమ్మించి మోసం చేయాలని చూసిన సైబర్ దుండగుడికి ఢిల్లీకి చెందిన ఓ యువకుడు చుక్కలు చూపించాడు. చాట్ జీపీటీ సాయంతో వెబ్ సైట్ లింక్ పంపించి మోసగాడి ఐపీ అడ్రస్, మొబైల్ కెమెరా హ్యాక్ చేసి ఫొటో సంపాదించాడు. ఆ వివరాలు అతడికే పంపడంతో సైబర్ మోసగాడు కాళ్లబేరానికి వచ్చాడు. ఇకపై ఈ మోసాలకు స్వస్తి చెబుతానని, తనను క్షమించమని ప్రాధేయపడ్డాడు. ఢిల్లీకి చెందిన ఓ యువకుడికి ఫేస్ బుక్ లో గుర్తుతెలియని వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. తన ఫ్రెండ్ సీఆర్పీఎఫ్ ఆఫీసర్ అని, అకస్మాత్తుగా బదిలీ కావడంతో ఇంట్లోని ఫర్నీచర్ మొత్తాన్ని అయినకాడికి అమ్మేస్తున్నాడని ఆగంతకుడు చెప్పాడు. ఫర్నీచర్ ఫొటోలు పెట్టి అతి తక్కువ ధరకే ఇప్పిస్తానని తెలిపాడు. అయితే, ఆ ప్రొఫైల్ ఫొటో తన కాలేజీ సీనియర్, ఐఏఎస్ ఆఫీసర్ దని ఢిల్లీ వాసి గుర్తించాడు. వెంటనే తన సీనియర్ కు ఫోన్ చేసి వివరాలు కనుక్కోవడంతో తనకు వచ్చిన మెసేజ్ మోసమని తేలింది. ఇక ఈ మోసగాడిని ఓ ఆట ఆడుకోవాలని భావించిన ఢిల్లీ యువకుడు.. ఫర్నీచర్ కొంటానని చెప్పాడు. దీంతో మోసగాడు ఓ క్యూఆర్ కోడ్ పంపి డబ్బులు చెల్లించాలని అడగగా.. ఆ కోడ్ స్కాన్ కావట్లేదని చెప్పి ఛాట్ జీపీటీ సాయంతో తయారుచేసిన ఫేక్ వెబ్ సైట్ లింక్ ను మోసగాడికి పంపించాడు. ఆ లింక్ ఓపెన్ చేసి క్యూఆర్ కోడ్ పోస్ట్ చేయాలని అడిగాడు. డబ్బులు వస్తున్నాయనే ఆనందంలో వెనకాముందు చూడకుండా మోసగాడు ఆ లింక్ క్లిక్ చేశాడు. ఆ వెంటనే మోసగాడి ఐపీ అడ్రస్, రాజస్థాన్ లోని అతడు ఉంటున్న ఇంటి చిరునామాతో పాటు మొబైల్ ఫ్రంట్ కెమెరా సాయంతో తీసిన స్పాట్ ఫొటో ఢిల్లీ వాసి రాబట్టాడు. ఆపై ఆ వివరాలను ఆ మోసగాడికే పంపించాడు. ఊహించని ఈ పరిణామంతో మోసగాడు కంగుతిన్నాడు. తనను వదిలేయాలని ప్రాధేయపడ్డాడు. అయితే, ఈ మోసగాడి వివరాలను, మోసం చేయాలనుకున్న పద్ధతికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని రాజస్థాన్ సైబర్ పోలీసులకు పంపించానని ఢిల్లీ వాసి చెప్పాడు. ఈ వివరాలన్నీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు.

## జాబ్‌కు డిగ్రీ అవసరం లేదు: జోహో ఫౌండర్ శ్రీధర్ వెంబు

చెన్నై: తన కంపెనీలో ఉద్యోగానికి డిగ్రీ అవసరం లేదని జోహో కార్పొరేషన్ సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు స్పష్టం చేశారు. ఆయన తరుచూ సామాజిక మాధ్యమాల్లో తన అభిప్రాయాలను పంచుకుంటారు. తాజాగా డిగ్రీ చదువుల గురించి 'ఎక్స్' వేదికగా స్పందించారు. తమ సంస్థలో ఉద్యోగం పొందడానికి డిగ్రీ తప్పనిసరి కాదని ఆయన పేర్కొన్నారు. డిగ్రీ చదవాలంటూ పిల్లలపై తల్లిదండ్రులు ఒత్తిడి చేయకూడదని సూచించారు. ప్రస్తుతం అమెరికాలో కొంతమంది ప్రతిభావంతులైన విద్యార్థులు కళాశాలలకు వెళ్లడం మానేస్తున్నారని, ముందుచూపు కలిగిన సంస్థలు వారికి అవకాశాలు కల్పిస్తున్నాయని ఆయన అన్నారు.

# ఒప్పందాలన్నీ 45 రోజుల్లో కార్యరూపం

## ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశం

తాడేపల్లి, డిసెంబర్ 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. రాష్ట్రంలో రూ.20,444 కోట్ల విలువైన నూతన పెట్టుబడులకు రాష్ట్ర పెట్టుబడుల బోర్డు ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 56,278 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన 13వ ఎస్ఐపీబీ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాల (ఎంఓయూ) పురోగతిపై కూడా సీఎం సమీక్షించారు. సదస్సులో కుదిరిన ఒప్పందాలలో ఇప్పటికే 50 శాతానికి పైగా ఆమోద ప్రక్రియలోకి వచ్చాయని, రాబోయే 45 రోజుల్లోగా మెజారిటీ ఒప్పందాలకు శంకుస్థాపనలు జరగాలని అధికారులను ఆయన గట్టిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం వల్లే ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. పరిశ్రమల స్థాపనకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా భూమి, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో సింగపూర్ వంటి దేశానికి చెందిన కంపెనీలను కూడా ఇబ్బందులకు గురిచేశారు. అలాంటి పరిస్థితులుంటే రాష్ట్రానికి పెట్టుబడులు రావు, అంతర్జాతీయంగా చెడ్డపేరు వస్తుంది. మేము ఆ ప్రతికూల వాతావరణాన్ని చెరిపివేసి, ఏపీకి ఒక బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకువచ్చాం. దాని ఫలితమే విశాఖ సదస్సు విజయవంతం కావడం" అని అన్నారు. విశాఖ సదస్సు జరిగి 20 రోజులు గడవకముందే రూ.7.69 కోట్ల విలువైన ఒప్పందాలు ఆచరణ దిశగా అడుగులు వేస్తున్నాయని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. "మిగిలిన ఎంఓయూలను కూడా వేగంగా పట్టాలెక్కించాలి. 45 రోజుల్లోగా అన్నింటినీ గ్రౌండింగ్ చేయాలి. వీలైనన్ని పరిశ్రమలకు శంకుస్థాపనలు చేసి దావోస్ సదస్సుకు వెళితే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతివారం సమీక్షించాలి. ఇకపై ఎస్ఐపీబీతో పాటు ఎంఓయూల పురోగతిని నేనే స్వయంగా పర్యవేక్షిస్తాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. భూసేకరణలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా,



భూములు ఇచ్చిన వారు కూడా సంతోషంగా ఉండేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వ యంత్రాంగం కూడా సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని సీఎం అన్నారు. "క్వాంటం వ్యాలీకి ఒక సలహా మండలిని నియమించండి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాథమిక అంశాలను 7వ తరగతి నుంచే పాఠ్యాంశంగా చేర్చాలి. దీనికోసం మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థల సహకారం తీసుకోండి" అని సూచించారు. దుబాయ్, యూఏఈ తరహాలో రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా రూ.500 కోట్ల ప్రారంభ మూలధనంతో 'సావరిన్ ఫండ్' ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా పశువుల దాణాను డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా తయారు చేయించే పరిశ్రమలను ప్రోత్సహించాలని, దీనికి నరేగా నిధులను వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 9 జిల్లాలను హార్టికల్చర్ హబ్‌లుగా అభివృద్ధి చేసి, ఉత్పత్తుల ఎగుమతికి అవసరమైన రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. విశాఖ కాపులుప్పాడలో హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి 50 ఎకరాలు కేటాయించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల స్థాయిని బట్టి ప్రోత్సాహకాలు అందించే పారదర్శక విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు.

## అమరావతిలో ఏకలవ్య కళా ఉత్సవాలు

**చదువు, సంస్కృతి**

**ముఖ్యమన్న కేంద్ర మంత్రి ఓరమ్**

అమరావతి, డిసెంబర్ 4 (ఈవార్తలు): గిరిజన విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా తమ సంస్కృతి, సంప్రదాయాలను కూడా నేర్చుకోవాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ అన్నారు. అమరావతిలోని కేఎల్ యూనివర్సిటీ వేదికగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఈఎంఆర్ఎస్) ఆరో జాతీయ కల్చరల్, లిటరరీ ఫెస్ట్ 'ఉద్భవ్-2025'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏకలవ్య స్కూళ్ల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాల తరహాలోనే ఏకలవ్య పాఠశాలలను కూడా అభివృద్ధి చేస్తామని ఓరమ్ హామీ ఇచ్చారు. విద్యార్థులకు హిందీ, ఆంగ్లంతో పాటు ప్రాంతీయ భాషలపై పట్టు సాధించడం కూడా ముఖ్యమని సూచించారు. క్రీడల్లోనూ గిరిజన విద్యార్థులు రాణిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న ఏపీ ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, అధికారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ, 'ఉద్భవ్' అనేది కేవలం వేడుక కాదని, గొప్ప మార్పునకు వేదికని అభివర్ణించారు. దేశవ్యాప్తంగా 405 పాఠశాలల నుంచి 1,647 మంది విద్యార్థులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారని, వారిలో 110 మంది ఏపీ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, పాఠశాలలకు మరిన్ని నిధులు, కొత్త ఈఎంఆర్ఎస్ స్కూళ్లు మంజూరు చేయాలని ఆమె కేంద్రమంత్రిని కోరారు.

### సుష్మా స్వరాజ్ భర్త కన్నుమూత

న్యూఢిల్లీ: దివంగత కేంద్రమంత్రి సుష్మా స్వరాజ్ భర్త, సీనియర్ న్యాయవాది, మిజోరం మాజీ గవర్నర్ స్వరాజ్ కౌశల్ (73) గురువారం కన్నుమూశారు. ఆయన కుమార్తె, ఢిల్లీ బీజేపీ ఎంపీ బన్సూరి స్వరాజ్ ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడిస్తూ భావోద్వేగ నివాళి అర్పించారు. "నాన్నా స్వరాజ్ కౌశల్ జీ, మీ ఆప్యాయత, క్రమశిక్షణ, దేశభక్తి, అపారమైన సహనం నా జీవితానికి ఎప్పటికీ వెలుగునిస్తాయి. మీ నిష్క్రమణ తీవ్రమైన వేదనను మిగిల్చినా, ఇప్పుడు మీరు అమ్మతో కలిసి భగవంతుని సన్నిధిలో శాశ్వత శాంతితో ఉంటారనే నమ్మకం నాకుంది. మీ కుమార్తెగా పుట్టడం నా జీవితంలో గొప్ప గర్వకారణం" అని బన్సూరి తన పోస్టులో పేర్కొన్నారు. 1952 జులై 12న సోలన్‌లో జన్మించిన స్వరాజ్ కౌశల్, ప్రముఖ క్రిమినల్ లాయర్‌గా పేరుగాంచారు. ఆయన 1990 నుంచి 1993 వరకు మిజోరం గవర్నర్‌గా పనిచేశారు. 1998 నుంచి 2004 వరకు హర్యానా వికాస్ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యునిగా కూడా సేవలందించారు. 1975లో సుష్మా స్వరాజ్‌ను వివాహం చేసుకున్నారు.

# 'సేవ్ ఏపీ' అనాల్సి వస్తోంది

## రైతుల పరిస్థితి అత్యంత దయనీయం.. వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి



తాడేపల్లి, డిసెంబర్ 4 (ఈవార్తలు): ఏపీలో రైతుల పరిస్థితిని చూస్తుంటే 'సేవ్ ఆంధ్రప్రదేశ్' అనాల్సిన దుస్థితి నెలకొందని వైసీపీ అధినేత జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వ పాలనలో రైతుల జీవితాలు ఛిన్నాభిన్నమయ్యాయని, పండుగలా ఉండాల్సిన వ్యవసాయం దండగలా మారిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారు. రైతు సంతోషంగా ఉంటేనే రాజ్యం సంతోషంగా ఉంటుందని జగన్ అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రైతులకు ఉచిత పంటల బీమాను ఒక హక్కుగా అందించామని, దీని కింద రూ.7,800 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు ఉరి వేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో 84 లక్షల మంది రైతులుంటే కేవలం 19 లక్షల మందికి మాత్రమే బీమా సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు. రూ.1,100 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు పేరుకుపోయాయని, వాటిని ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం చెప్పడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం కింద ఏటా రూ. 20,000 ఇస్తామని హామీ ఇచ్చి, రెండేళ్లలో రూ. 40,000కు బదులుగా కేవలం రూ. 10,000 మాత్రమే ఇచ్చారని జగన్ దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదని, దళారులు రైతులను దోచుకుంటున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. మొంథా తుపాను విషయంలో ప్రభుత్వం హడావుడి చేసిందని, ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప రైతులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతోనే ఈ విషయాలు వెల్లడిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

**చంద్రబాబుకు దేవుడంటే భయం లేదు: జగన్**

తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని వైసీపీ అధినేత జగన్ స్పష్టం చేశారు. దీనిని పూర్తిగా దుష్ప్రచారంగా అభివర్ణించిన ఆయన, దేవుడిని కూడా రాజకీయాల్లోకి లాగుతున్నారని మండిపడ్డారు. దేవుడంటే భక్తి, భయం లేని చంద్రబాబు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, "కల్తీ నెయ్యి ఆరోపణలు ఉన్న ఆ ట్యాంకర్లు ప్రసాదం తయారుచేసే పోటులోకి వెళ్లాయా? అందుకు మీ దగ్గర ఆధారాలు ఉన్నాయా?" అని సూటిగా ప్రశ్నించారు. టీటీడీలోకి వచ్చే ప్రతి నెయ్యి ట్యాంకర్‌ను కఠినమైన తనిఖీలకు గురిచేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారని ఆయన స్పష్టం చేశారు. ఎన్ఏబీఎల్ సర్టిఫికేషన్ ఉన్నప్పటికీ, టీటీడీ సొంత ల్యాబ్‌లో కూడా పరీక్షలు పాస్ అయితేనే ఆ నెయ్యిని వినియోగానికి స్వీకరిస్తారని వివరించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని ట్యాంకర్లను వెనక్కి పంపడం ఒక సాధారణ ప్రక్రియ అని జగన్ తెలిపారు. గతంలో చంద్రబాబు హయాంలో 17 సార్లు, తమ ప్రభుత్వ హయాంలో 18 సార్లు ట్యాంకర్లను తిప్పి పంపిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఇంతటి పటిష్టమైన భద్రతా, నాణ్యతా ప్రమాణాలు అమల్లో ఉండగా కల్తీ జరిగిందని ఎలా అంటారని నిలదీశారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే పవిత్రమైన ప్రసాదంపై ఆరోపణలు చేస్తున్నారని జగన్ అన్నారు.

# తిరుపతి కేంద్రంగా 'బాలాజీ రైల్వే డివిజన్'

**కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కు టీడీపీ ఎంపీల వినతి**




న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంత సమగ్రాభివృద్ధి లక్ష్యంగా తిరుపతి కేంద్రంగా 'బాలాజీ రైల్వే డివిజన్' ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నాడు టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు నేతృత్వంలోని బృందం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి ఈ మేరకు ఒక సవివరమైన వినతి పత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్పందిస్తూ... రాయలసీమ ప్రాంతంలో 300 కిలోమీటర్ల పరిధిలో ఒక్క రైల్వే డివిజన్ కూడా లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు. తిరుపతి స్టేషన్ ఏటా సుమారు రూ.250 కోట్ల ఆదాయం ఆర్జిస్తూ, దేశంలోనే అత్యధిక ఆదాయం గల స్టేషన్లలో ఒకటిగా ఉందని గుర్తుచేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో, రాయలసీమలో సమగ్రాభివృద్ధి, సమర్థవంతమైన రైలు సేవలు అందించడానికి ఈ కొత్త డివిజన్ ఏర్పాటు చాలా అవసరమని తమ విజ్ఞాపనలో పేర్కొన్నట్టు వివరించారు. ప్రతిపాదిత బాలాజీ రైల్వే డివిజన్ 1,550 కిలోమీటర్లకు పైగా రైలు మార్గాన్ని కవర్ చేస్తుందని ఎంపీ వివరించారు. ఈ డివిజన్ ఏర్పడితే చెన్నై, బెంగళూరు, విజయవాడ వంటి ప్రధాన నగరాలతో పాటు కృష్ణపట్నం పోర్టుకు కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడుతుందని తెలిపారు. తిరుపతి%-%ఒంగోలు, పాకాల%-%ధర్మవరం, రేణిగుంట%-%యర్రగుంట్ల, నంద్యాల, నడికుడి, కృష్ణపట్నం వంటి ప్రధాన మార్గాలతో పాటు, ప్రతిపాదిత కడప బెంగళూరు లైన్ కూడా ఈ డివిజన్ పరిధిలోకి వస్తాయని తమ వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు.

## చంద్రబాబు మాట దశాబ్దపు జోక్: షర్మిల




విజయవాడ, డిసెంబర్ 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ ఛార్జీలపై చేసిన వ్యాఖ్యలను ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. ఛార్జీలు పెంచబోమని చంద్రబాబు చెప్పడం ఈ దశాబ్దపు అతిపెద్ద జోక్ అని ఆమె ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే సర్దుబాటు, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేల కోట్ల భారం మోపిందని ఆరోపించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. "విద్యుత్ చార్జీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు తీవ్ర హాస్యాస్పదం. బిల్లుల మోతతో ఒకపక్క వాతలు పెడుతున్నారు. సర్దుపోటుతో గుండెపోటు తెప్పిస్తున్నారు. షాకుల మీద షాకులు ఇస్తూ ఇల్లు గుల్ల చేస్తున్నారు. మరోపక్క ఛార్జీలు పెంచమని తేనె పూసిన కత్తి మాటలు చెప్తున్నారు. 17 నెలల కూటమి పాలనలో ప్రజలపై మోపిన అధిక చార్జీల భారం రూ.15,485 కోట్లు. వచ్చే రెండేళ్ల పాటు ట్రూ అప్ ప్రజల నెత్తిన పెను భారమే. యూనిట్ కు అదనంగా 40 పైసలు చొప్పున ముక్కుపిండి వసూలు చేస్తూ కూడా... ఛార్జీలు పెంచను, మాటమీద కట్టుబడి ఉన్నాం అంటూ చంద్రబాబు చెబుతున్న మాట ఈ దశాబ్దపు అతి పెద్ద జోక్. ఇచ్చిన మాట మీద నిలబడే తత్వమే చంద్రబాబుకు ఉంటే, ఛార్జీల భారం ప్రజలపై పడొద్దనే చిత్తశుద్ధి ఉంటే, వెంటనే సర్దుబాటు భారం రూ.15,485 కోట్లు రద్దు చేయండి. ట్రూ అప్ పేరుతో ఇప్పటి వరకు వసూలు చేసిన 3 వేల కోట్లను ప్రజలకు ట్రూ డౌన్ రూపంలో తిరిగి చెల్లించండి. అమలవుతున్న ఛార్జీలలో 30 శాతం తగ్గింపు వెంటనే అమలు చేయండి" అంటూ షర్మిల డిమాండ్ చేశారు.

## కోటి సంతకాల ఉద్యమానికి అనూహ్య స్పందన: సజ్జల



తాడేపల్లి, డిసెంబర్ 4 (ఈవార్తలు): ఏపీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన 'కోటి సంతకాల ప్రజా ఉద్యమం' కార్యక్రమానికి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని ఆ పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. పార్టీ నేతలతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. కోటి సంతకాలను లక్ష్యంగా పెట్టుకుంటే, అంతకుమించి వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 16న పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఈ సంతకాలను గవర్నర్‌కు అందజేయనున్నట్లు సజ్జల వెల్లడించారు. ఈ మేరకు కార్యక్రమ షెడ్యూల్‌ను నేతలకు వివరించారు. నియోజకవర్గ స్థాయిలో సేకరించిన సంతకాలను ఈ నెల 10వ తేదీలోగా జిల్లా పార్టీ కార్యాలయాలకు, అక్కడి నుంచి 13న తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయానికి పంపాలని సూచించారు. సంతకాలను పంపే ముందు నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో ప్రజలు, మీడియా ముందు ప్రదర్శించి, బాక్సుల్లో సర్ది పంపాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య నేతలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అధినేత జగన్ ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని, జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర కార్యాలయానికి ర్యాలీగా తరలించాలని చెప్పినట్టు సజ్జల పేర్కొన్నారు. పార్టీ అనుబంధ విభాగాలు కూడా ఈ ఉద్యమంలో కీలకపాత్ర పోషించాలని ఆయన కోరారు.

## బాబ్రీ మసీదు కడతానన్న ఎమ్మెల్యేపై వేటు

**టీఎంసీ ఎమ్మెల్యే హుమాయున్ కబీర్‌పై సస్పెన్షన్ వేటు**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో బాబ్రీ మసీదు ప్రతిరూపాన్ని నిర్మిస్తానని ప్రకటించిన అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎమ్మెల్యే హుమాయున్ కబీర్‌పై పార్టీ అధిష్ఠానం వేటు వేసింది. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ముర్షిదాబాద్ జిల్లాలో డిసెంబర్ 6న మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని కబీర్ ప్రకటించడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ విషయంపై కోల్‌కతా మేయర్, టీఎంసీ సీనియర్ నేత ఫిర్హాద్ హకీం స్పందించారు. "మా పార్టీ లౌకిక సిద్ధాంతాన్ని విశ్వసిస్తుంది. ముర్షిదాబాద్‌కు చెందిన మా ఎమ్మెల్యే ఒకరు అకస్మాత్తుగా బాబ్రీ మసీదు కడతానని ప్రకటించారు. ఈ విషయంలో మేం ఆయన్ను ముందే హెచ్చరించాం. పార్టీ నిర్ణయం ప్రకారం హుమాయున్ కబీర్‌ను సస్పెండ్ చేస్తున్నాం" అని ఆయన తెలిపారు. ఇది బెంగాల్‌ను మతపరంగా విభజించేందుకు బీజేపీ అనుసరిస్తున్న విధానం లాంటిదని ఫిర్హాద్ హకీం ఆరోపించారు. "కబీర్ డిసెంబర్ 6వ తేదీనే ఎందుకు ఎంచుకున్నారు? మసీదుకు బదులుగా పాఠశాల లేదా కళాశాల నిర్మించవచ్చు కదా? ఎన్నికలకు ముందు ఇలాంటి విభజన రాజకీయాలు చేయడం అన్నది బీజేపీకి అలవాటు. కబీర్ కూడా ఇప్పుడు అలాంటి విభజన రాజకీయాలలో పడ్డారు " అని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యే కబీర్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, శుక్రవారం టీఎంసీకి రాజీనామా చేసి, సొంత పార్టీని స్థాపించి మసీదు నిర్మాణం అంశాన్ని ముందుకు తీసుకెళ్లాలని కబీర్ యోచిస్తున్నట్లు సమాచారం. ఈ వివాదంపై గవర్నర్ ఆనంద బోస్ కూడా స్పందించారు. కబీర్ వ్యాఖ్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తుంటే, ఆయన్ను ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. డిసెంబర్ 6న కార్యక్రమం నిర్వహించడానికి కబీర్‌కు అనుమతి ఉన్నప్పటికీ, ముర్షిదాబాద్ జిల్లాలో అధికారులు అప్రమత్తంగా ఉండి, భద్రతను కట్టుదిట్టం చేశారు.

## అబద్ధాలకు అంబాసిడర్ జగన్: అచ్చెన్నాయుడు



అమరావతి, డిసెంబర్ 4 (ఈవార్తలు): ఏపీ మాజీ సీఎం జగన్ పై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగన్‌ను 'అబద్ధాల అంబాసిడర్' అని అభివర్ణించిన ఆయన, రైతు సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. జగన్ ప్రభుత్వంపై చేస్తున్న నీచ ఆరోపణలు, ఆయన ఐదేళ్ల అబద్ధపు పాలనపై ఆయనే బురద చల్లుకున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు స్పందిస్తూ, "జగన్ ఐదేళ్ల మోసపూరిత పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగింది. రూ. 1,674 కోట్ల ధాన్యం బకాయిలు పెట్టి రైతుల హక్కులను తాకట్టు పెట్టారు. కష్టకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. ఆయన హయాంలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో కూడా విఫలమయ్యారు" అని ఆరోపించారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. "మేము అధికారంలోకి రాగానే ధాన్యం బకాయిలను, రైతు ఆత్మహత్యల పరిహారాన్ని వెంటనే చెల్లించి బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చాం. కేవలం 18 నెలల్లోనే మద్దతు ధరల కోసం రైతుల కోసం రూ. 800 కోట్లు ఖర్చు చేసి అండగా నిలిచాం. రైతును రాజుగా చేసింది ఎవరో ప్రజలకు స్పష్టంగా తెలుసు" అని వివరించారు. జగన్ అబద్ధాలు, తమ ప్రభుత్వ వాస్తవాలపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని, దమ్ముంటే రావాలని జగన్‌కు అచ్చెన్న సవాల్ విసిరారు.

# రఘురామ కిడ్నీల్లో రాళ్లు

**శస్త్రచికిత్స విజయవంతం**



హైదరాబాద్, డిసెంబర్ 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు గురువారం శస్త్రచికిత్స చేయించుకున్నారు. కిడ్నీలో రాళ్ల సమస్య కారణంగా ఆయన ఈరోజు ఉదయం వైద్య చికిత్స తీసుకున్నారు. ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉందని, వేగంగా కోలుకుంటున్నానని ఆయన స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు రఘురామకృష్ణరాజు ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈరోజు ఉదయం నేను కిడ్నీలో రాళ్ల తొలగింపు కోసం శస్త్రచికిత్స చేయించుకోవడం జరిగింది. ప్రస్తుతం నేను కోలుకుంటున్నాను" అని ఆయన తెలిపారు. తనకు అద్భుతమైన వైద్య సేవలు అందించిన వైద్య బృందానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే, తన శ్రేయస్సును ఆకాంక్షించిన మిత్రులకు, శ్రేయోభిలాషులకు కూడా రఘురామ కృతజ్ఞతలు చెప్పారు.

## బెంగాల్‌లో 32 వేల మంది టీచర్లకు ఊరట

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో 32 వేల మంది ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు కలకత్తా హైకోర్టులో భారీ ఊరట లభించింది. వారి నియామకాలను రద్దు చేస్తూ సింగిల్ బెంచ్ గతంలో ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ బుధవారం పక్కన పెట్టింది. ఈ నియామకాలన్నీ చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేస్తూ కీలక తీర్పు వెలువరించింది. నియామక పరీక్షలో కొందరు అభ్యర్థులు విఫలమైనంత మాత్రాన మొత్తం వ్యవస్థపై ప్రభావం పడకూడదని డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఇంతవరకు నిరూపితం కాలేదని పేర్కొంది. ఇప్పటికే తొమ్మిదేళ్లుగా సర్వీసులో కొనసాగుతున్న ఉపాధ్యాయులను ఉద్యోగాల నుంచి తొలగిస్తే, వారిపై, వారి కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించింది. కేవలం కొనసాగుతున్న విచారణను ఆధారంగా చేసుకుని నియామకాలను రద్దు చేయలేమని వివరించింది. ఈ తీర్పుపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హర్షం వ్యక్తం చేశారు. వేలాది టీచర్ల కుటుంబాలకు న్యాయస్థానం గొప్ప ఊరటనిచ్చిందని అన్నారు. యువతకు కొత్త ఉద్యోగాలు సృష్టించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఉన్న ఉద్యోగాలను తొలగించే ఆలోచన లేదని స్పష్టం చేశారు. న్యాయమూర్తులు మానవతా దృక్పథంతో ఆలోచించి తీర్పు ఇచ్చారని ఆమె ప్రశంసించారు.

## త్వరలో టోల్‌ప్లాజాల వద్ద కొత్త వ్యవస్థ: గడ్కరీ



న్యూఢిల్లీ: టోల్‌ప్లాజాల వద్ద వాహనాలు ఒక్క క్షణం కూడా ఆగకుండా ఉండేందుకు వీలుగా సరికొత్త ఎలక్ట్రానిక్ వ్యవస్థను మరికొద్ది నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ వ్యవస్థను ఇప్పటికే 10 ప్రాంతాల్లో అమలు చేస్తున్నామని, ఒక సంవత్సరం లోపు దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన అన్నారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుత విధానానికి స్వస్తి పలికి, ఏడాదిలో దేశవ్యాప్తంగా కొత్త విధానం అమల్లోకి రానుందని ఆయన స్పష్టం చేశారు. "ప్రస్తుత టోల్ వసూలులో ఉన్న విధానానికి బదులుగా కొత్త ఎలక్ట్రానిక్ విధానం అమలులోకి రానుంది. ఈ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత టోల్‌ప్లాజాల వద్ద ఎవరూ మిమ్మల్ని ఆపరు. దేశవ్యాప్తంగా దీనిని త్వరలో అమలు చేస్తాం" అని గడ్కరీ పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో రూ.10 లక్షల కోట్ల విలువైన 4,500 హైవే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) ఇటీవల విడుదల చేసిన ప్రకటన ప్రకారం, టోల్‌ప్లాజాల వద్ద ఫీజు వసూలు చేసేందుకు నేషనల్ ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ కార్యక్రమాన్ని ఎన్పీసీఐ తీసుకువచ్చింది. ఇది ఫాస్టాగ్ ద్వారానే పని చేస్తుంది. టోల్‌ప్లాజా మీదుగా వాహనం వెళ్లినప్పుడు ఆపాల్సిన అవసరం లేకుండానే యూజర్ బ్యాంకు ఖాతా నుంచి ఫీజు ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది.

## ఐటీ షేర్ల జోరుతో లాభాల్లో మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజుల వరుస నష్టాలకు స్వస్తి పలికాయి. గురువారం జరిగిన ట్రేడింగ్‌లో సూచీలు స్వల్ప లాభాలతో ముగిశాయి. ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు, అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి బలపడటం మార్కెట్లకు కలిసొచ్చింది. అయితే, శుక్రవారం వెలువడనున్న ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో లాభాలు పరిమితంగానే ఉన్నాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 158.5 పాయింట్లు లాభపడి 85,265.32 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 47.75 పాయింట్లు పెరిగి 26,033 వద్ద ముగిసింది. సెక్టార్ల వారీగా చూస్తే నిఫ్టీ ఐటీ సూచీ అత్యధికంగా 1.4 శాతం లాభపడింది. రియల్టీ, ఎఫ్ఎంసీజీ, ఆటో, ఫార్మా రంగాలు కూడా రాణించాయి. మరోవైపు, నిఫ్టీ మీడియా సూచీ 1.45% నష్టపోయింది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. బ్రాడర్ మార్కెట్లలో మాత్రం బలహీనత కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 స్వల్పంగా నష్టపోగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.24 శాతం క్షీణించింది. సెన్సెక్స్ షేర్లలో టీసీఎస్, భారత్ ఎలక్ట్రానిక్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్ ప్రధానంగా లాభపడగా... రిలయన్స్ ఇండస్ట్రీస్, మారుతీ సుజుకీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్ నష్టపోయాయి. ఇక ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 28 పైసలు బలపడి 89.91 వద్ద ట్రేడ్ అయింది. ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై కొత్త ఆశలతో ఐటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించిందని విశ్లేషకులు తెలిపారు.

## మలేరియా 'ఫీవర్'!

**2024లో 6.10 లక్షల మంది మృతి**

**పెరుగుతున్న డ్రగ్ రెసిస్టెన్స్ పెనుసవాల్**

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా మలేరియా మహమ్మారి మళ్లీ పంజా విసురుతోంది. 2024లో దాదాపు 28.2 కోట్ల మంది మలేరియా బారిన పడగా, 6.10 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. ఈరోజు విడుదల చేసిన ఈ నివేదిక, మలేరియా నిర్మూలన ప్రయత్నాలకు డ్రగ్ రెసిస్టెన్స్ (మందులకు లొంగని తత్వం) పెద్ద ముప్పుగా పరిణమించిందని హెచ్చరించింది. గతేడాదితో పోలిస్తే కేసుల సంఖ్య 90 లక్షలు పెరిగింది. మరణాలలో 95 శాతం ఆఫ్రికా దేశాల్లోనే సంభవించగా, వీరిలో ఐదేళ్ల లోపు చిన్నారులే అధికంగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇక, ఆగ్నేయాసియా రీజియన్‌లో నమోదైన మొత్తం కేసులలో 73.3 శాతం మరణాలలో 88.7 శాతం భారత్‌లోనే ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. ఇది దేశంలో వ్యాధి తీవ్రతకు అద్దం పడుతోంది. మలేరియాపై పోరాటంలో కొన్ని సానుకూల అంశాలు ఉన్నప్పటికీ, సవాళ్లు తీవ్రంగా ఉన్నాయి. ఒకవైపు వ్యాక్సిన్‌ల వాడకం ద్వారా 2024లో 17 కోట్ల కేసులను, 10 లక్షల మరణాలను నివారించగలిగారు. మరోవైపు, ఆఫ్రికాలోని 8 దేశాల్లో మలేరియా మందులు పనిచేయకపోవడం, 48 దేశాల్లో దోమలు కీటకనాశకాలను తట్టుకోవడం వంటివి సమస్యను జఠిలం చేస్తున్నాయి. వాతావరణ మార్పులు, నిధుల కొరత కూడా నిర్మూలన కార్యక్రమాలను దెబ్బతీస్తున్నాయి. "మలేరియా నివారణకు కొత్త సాధనాలు మనకు ఆశ కల్పిస్తున్నాయి. కానీ, పెరుగుతున్న కేసులు, డ్రగ్ రెసిస్టెన్స్, నిధుల కోత వంటి సవాళ్లు మనం సాధించిన పురోగతిని వెనక్కి నెట్టే ప్రమాదం ఉంది. అయినా పటిష్ఠమైన నాయకత్వం, సరైన పెట్టుబడులతో మలేరియా రహిత ప్రపంచాన్ని సాధించడం సాధ్యమే" అని డబ్ల్యూహెచ్ఓ డైరెక్టర్-జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ తెలిపారు.

## అమెరికా నుంచి 18,822 మంది భారతీయుల బహిష్కరణ

న్యూఢిల్లీ: 2009 నుంచి ఇప్పటివరకు 18,822 మంది భారత పౌరులను అమెరికా తమ దేశం నుంచి బహిష్కరించిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వీరిలో ఈ ఏడాది (2025) జనవరి నుంచి ఇప్పటివరకు 3,258 మందిని వెనక్కి పంపినట్లు తెలిపింది. ఇవాళ రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రి అందించిన వివరాల ప్రకారం.. 2023లో 617 మంది, 2024లో 1,368 మంది భారతీయులను అమెరికా బహిష్కరించింది. ఈ ఏడాది వెనక్కి వచ్చిన 3,258 మందిలో 2,032 మంది (సుమారు 62.3 శాతం) సాధారణ కమర్షియల్ విమానాల్లో రాగా, మిగిలిన 1,226 మందిని (37.6 శాతం) యూఎస్ ఇమ్మిగ్రేషన్ అధికారుల ప్రత్యేక చార్టర్ విమానాల్లో భారత్‌కు పంపించారు. ఈ బహిష్కరణల వెనుక మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) కీలక కారణంగా ఉందని జైశంకర్ సభకు వివరించారు.




# భారీగా ఇండిగో సర్వీసులు రద్దు

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద బడ్జెట్ విమానయాన సంస్థ ఇండిగోకు కష్టాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా సిబ్బంది కొరత కారణంగా విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వరుసగా మూడో రోజైన గురువారం కూడా దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో పెద్ద సంఖ్యలో విమానాలను రద్దు చేయడంతో వేలాది మంది ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో ఇండిగో కార్యకలాపాలు స్తంభించాయి. గురువారం ఉదయం ఢిల్లీ నుంచి బయలుదేరాల్సిన 30కి పైగా విమానాలు, హైదరాబాద్‌లో సుమారు 33 విమానాలు రద్దయ్యాయి. ఎన్డీటీవీ కథనం ప్రకారం.. నేడు దేశవ్యాప్తంగా 170కి పైగా ఇండిగో విమానాలు రద్దయ్యే అవకాశం ఉంది. నిన్న కూడా నాలుగు ప్రధాన నగరాల్లో కలిపి దాదాపు 200 సర్వీసులను నిలిపివేశారు. విమానాల రద్దుపై ఇండిగో స్పందించింది. తమ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగిందని అంగీకరిస్తూ, ప్రయాణికులకు క్షమాపణలు చెప్పింది. ఊహించని కార్యాచరణ సవాళ్లు, సాంకేతిక లోపాలు, శీతాకాలం షెడ్యూల్ మార్పులు, సిబ్బంది రోస్టరింగ్‌కు సంబంధించిన కొత్త నిబంధనలు వంటి అనేక కారణాలు తమ కార్యకలాపాలపై ప్రభావం చూపాయని ఒక ప్రకటనలో తెలిపింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రాబోయే 48 గంటల పాటు షెడ్యూళ్లలో సర్దుబాట్లు చేస్తున్నామని, త్వరలోనే సేవలను సాధారణ స్థితికి తీసుకొస్తామని పేర్కొంది. ఈ పరిణామాల నేపథ్యంలో, విమానయాన నియంత్రణ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) రంగంలోకి దిగింది. విమానాల రద్దుకు గల కారణాలపై పూర్తి నివేదిక సమర్పించాలని, ప్రయాణికుల ఇబ్బందులను తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించాలని ఇండిగోను ఆదేశించింది. ఈ అంశంపై చర్చించేందుకు గురువారం సంస్థ అధికారులను సమావేశానికి పిలిచింది. నవంబర్ నెలలో ఏకంగా 1,232 విమానాలను ఇండిగో రద్దు చేసినట్లు డీజీసీఏ తెలిపింది. వీటిలో 755 విమానాలు సిబ్బంది కొరత, ఎఫ్‌డీటీఎల్ నిబంధనల వల్లే రద్దయ్యాయని పేర్కొంది. దీనివల్ల అక్టోబర్‌లో 84.1 శాతంగా ఉన్న ఇండిగో ఆన్-టైమ్ పనితీరు నవంబర్‌కు 67.7 శాతానికి పడిపోయింది. పైలట్లకు వారానికి 48 గంటల విశ్రాంతి, రాత్రిపూట ల్యాండింగ్‌లను రెండుకు పరిమితం చేయడం వంటి నిబంధనలు నవంబర్ 1 నుంచి అమలులోకి రావడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

# హిజాబ్ ధరించాల్సిందే!

**సమర్థించుకున్న ఇరాన్ అధినేత ఖొమేనీ.. అమెరికాలో కుటుంబ వ్యవస్థ నాశనమైందంటూ వ్యాఖ్యలు**




టెహ్రాన్: ఇరాన్ అత్యున్నత నేత అయాతుల్లా అలీ ఖొమేనీ మరోసారి హిజాబ్ చట్టాన్ని గట్టిగా సమర్థించుకున్నారు. పెట్టుబడిదారీ విధానం మహిళల గౌరవాన్ని దెబ్బతీస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. దేశంలో మహిళలు హిజాబ్ నిబంధనలను బహిరంగంగా ధిక్కరిస్తున్న తరుణంలో, ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. పాశ్చాత్య దేశాల్లో మహిళలను ఒక వస్తువుగా చూస్తూ, వారి ఆత్మగౌరవాన్ని కాలరాస్తున్నారని ఖొమేనీ విమర్శించారు. "మహిళల భద్రత, గౌరవం, మర్యాదను కాపాడటమే వారి హక్కులలో ప్రధానమైనది. దుష్ట పెట్టుబడిదారీ తర్కం మహిళల గౌరవాన్ని నాశనం చేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ దేశాల్లో మహిళలు దోపిడీకి గురవుతున్నారని, సమాన పనికి పురుషుల కన్నా తక్కువ వేతనం పొందుతున్నారని ఆరోపించారు. అమెరికా సంస్కృతిపై విరుచుకుపడిన ఖొమేనీ, అక్కడ కుటుంబ వ్యవస్థ పూర్తిగా నాశనమైందని అన్నారు. "తండ్రిలేని పిల్లలు, క్షీణిస్తున్న కుటుంబ సంబంధాలు, యువతులపై మూకల దాడులు, స్వేచ్ఛ పేరుతో పెరిగిపోతున్న లైంగిక విశృంఖలత్వం.. ఇదీ పశ్చిమ దేశాల్లో కుటుంబాల పరిస్థితి" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇస్లాంలో మహిళలకు స్వాతంత్ర్యం, గుర్తింపు, అభివృద్ధి చెందే అవకాశం ఉన్నాయని ఆయన వివరించారు. "ఇస్లాం దృష్టిలో మహిళ ఇంటికి ఒక పువ్వు లాంటిది. ఆమెను సేవకురాలిగా కాకుండా జాగ్రత్తగా చూసుకోవాలి" అని తెలిపారు. అయితే, ఖొమేనీ వాదనలకు, ఇరాన్‌లోని వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని మానవ హక్కుల సంఘాలు చెబుతున్నాయి. ఏడేళ్ల వయసు నుంచే హిజాబ్ తప్పనిసరి చేయడం, బాల్య వివాహాలు, గృహ హింస నుంచి చట్టపరమైన రక్షణ లేకపోవడం వంటి తీవ్రమైన వివక్షను ఇరాన్‌లో మహిళలు ఎదుర్కొంటున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

# కెనడాలో రోబోలా బతకలేను

**ఐదేళ్ల తర్వాత ఇండియాకు తిరిగొస్తున్నా**

**రెడ్డిట్‌లో ఎన్నారై పోస్ట్ వైరల్**



న్యూఢిల్లీ: ఉత్తమ ఉద్యోగావకాశాలు, మెరుగైన జీవన ప్రమాణాల కోసం విదేశాలకు వెళ్లడం సర్వసాధారణం. అయితే, కెరీర్‌లో ఎంత ఎత్తుకు ఎదిగినా సొంత దేశానికి, ఆత్మీయులకు దూరంగా ఉండటం వల్ల కలిగే ఒంటరితనం చాలామందిని వేధిస్తుంటుంది. సరిగ్గా ఇలాంటి అనుభవాన్నే ఎదుర్కొన్న ఓ ప్రవాస భారతీయుడు (ఎన్నారై) ఐదేళ్ల తర్వాత కెనడాను వదిలి భారత్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నాడు. ఈ సందర్భంగా తన ఆవేదనను పంచుకుంటూ పెట్టిన ఓ రెడ్డిట్ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. "కెనడాలో ఐదేళ్లు ఉన్న తర్వాత నా వల్ల కాలేదు. ఇక్కడ నాకు స్నేహితులు ఉన్నప్పటికీ, సామాజిక ఒంటరితనం నన్ను కుంగదీసింది. విదేశాల్లో జీవితం ఒక రోబోలా అనిపించింది. ఆ ఫీలింగ్‌ను మాటల్లో వర్ణించడం కష్టం" అని ఆ యువకుడు తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. అక్కడి జీవనశైలి గురించి వివరిస్తూ.. "ప్రతీది ఒక పద్ధతి ప్రకారం, పక్కా ప్లాన్‌తో జరగాలి. కనీసం బియ్యం కొనడానికి దుకాణానికి వెళ్లాలన్నా ముందుగానే ప్లాన్ చేసుకోవాలి. ఈ అతి క్రమశిక్షణతో స్వేచ్ఛగా బతుకుతున్నానన్న భావనే పోయింది" అని తెలిపాడు. భారత్‌లోని జీవన విధానాన్ని తాను ఎంతగానో ఇష్టపడతానని అతను చెప్పాడు. "భారత్‌లో ఉండే 'వ్యవస్థీకృత గందరగోళం' నాకు చాలా ఇష్టం. అనుకోకుండా జరిగే పరిచయాలు, అప్పటికప్పుడు వేసుకునే ప్లాన్‌లను చాలా మిస్ అయ్యాను. అందుకే ఇక ఇక్కడ ఉండలేనని నిర్ణయించుకున్నా" అని వివరించాడు. "భారత్‌లో శుభ్రత, పౌర స్పృహ తక్కువని విమర్శలు ఉండొచ్చు. కానీ ఎన్ని లోపాలున్నా నాకిదే ఇష్టం. ఎందుకంటే ఇది నా ఇల్లు" అని పేర్కొన్నాడు. ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు అతడి నిర్ణయాన్ని ప్రశంసిస్తున్నారు. "ధైర్యమైన నిర్ణయం తీసుకున్నావు, నీ మనసు చెప్పింది వినడం మంచిది" అంటూ కామెంట్లు పెడుతున్నారు. ప్రతి ప్రదేశానికి దాని లాభనష్టాలు ఉంటాయని, మనకు సంతోషాన్నిచ్చే చోట ఉండటమే ముఖ్యమని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఈ సంఘటన విదేశాల్లో స్థిరపడిన చాలామంది భారతీయులు ఎదుర్కొంటున్న మానసిక సంఘర్షణకు అద్దం పడుతోంది.

## మారణహోమానికి కుట్ర

**అమెరికాలో పాక్ సంతతి విద్యార్థి అరెస్ట్**

న్యూయార్క్: అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ డెలావేర్‌లో చదువుతున్న లుఖ్‌మాన్ ఖాన్‌ను నవంబర్ 24న అమెరికా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక పార్కులో పికప్ ట్రక్కులో అనుమానాస్పదంగా కనిపించడంతో అధికారులు వాహనాన్ని తనిఖీ చేశారు. ఆ సమయంలో వాహనంలో ఒక గ్లాక్ హ్యాండ్‌గన్, దానికి అమర్చిన 27 రౌండ్ల మ్యాగజైన్, సెమీ ఆటోమేటిక్ రైఫిల్‌గా మార్చే కన్వర్షన్ కిట్, అదనంగా మరో మూడు లోడెడ్ మ్యాగజైన్లు, బుల్లెట్ ప్రూఫ్ ప్లేట్, చేతిరాతతో ఉన్న ఒక నోట్‌బుక్‌ను గుర్తించారు. ఈ నోట్‌బుక్‌లో మరిన్ని ఆయుధాల వివరాలు, వాటిని దాడిలో ఎలా ఉపయోగించాలి, దాడి తర్వాత పోలీసుల నుంచి ఎలా తప్పించుకోవాలి వంటి అంశాలు రాసి ఉన్నాయి. అంతేకాకుండా, యూనివర్సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోని ఒక అధికారి పేరుతో పాటు, "యూడీ పోలీస్ స్టేషన్" అనే పేరుతో ఒక భవనం మ్యాప్, దాని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను కూడా గీసి ఉన్నట్లు అధికారులు తెలిపారు. "అందరినీ చంపాలి", "అమరవీరుడు కావాలి" వంటి పదాలు ఈ పుస్తకంలో పలుమార్లు కనిపించాయి. పోలీసుల విచారణలో, అమరవీరుడు కావడం అనేది ఒక వ్యక్తి చేయగల గొప్ప పనులలో ఒకటని ఖాన్ చెప్పినట్లు న్యూయార్క్ పోస్ట్ కథనం పేర్కొంది. పాకిస్థాన్‌లో జన్మించిన ఖాన్, చిన్నతనం నుంచే అమెరికాలో నివసిస్తున్నాడని, అతనికి అమెరికా పౌరసత్వం ఉందని తెలిసింది. అనంతరం, ఖాన్ నివాసంలో ఎఫ్‌బీఐ అధికారులు జరిపిన సోదాల్లో రెడ్-డాట్ స్కోప్‌తో కూడిన ఏఆర్-స్టైల్ రైఫిల్, నిమిషానికి 1200 రౌండ్లు కాల్చగల సామర్థ్యమున్న అక్రమ ఆటోమేటిక్ మెషిన్ గన్‌గా మార్చిన మరో గ్లాక్ పిస్టల్, 11 అదనపు మ్యాగజైన్లు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ స్వాధీనం చేసుకున్నారు. అతని వద్ద ఉన్న ఏ ఆయుధానికీ రిజిస్ట్రేషన్ లేదని తేలింది. నవంబర్ 26న అతనిపై అక్రమంగా మెషిన్ గన్ కలిగి ఉన్నాడనే అభియోగాలపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఖాన్ జైలులో ఉండగా, ఎఫ్‌బీఐ ఈ కేసుపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తోంది.

## రష్యా డ్రోన్ కంట్రోల్ సెంటర్‌పై ఉక్రెయిన్ దాడి

కీవ్:రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. తాజాగా ఉక్రెయిన్‌లోని వోవ్‌చాన్స్క్‌లో రష్యాకు చెందిన కీలకమైన డ్రోన్ కంట్రోల్ మరియు కమ్యూనికేషన్ కేంద్రాన్ని ఉక్రెయిన్ వైమానిక దళం విజయవంతంగా ధ్వంసం చేసింది. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియో ప్రకారం, ఒక గ్రెయిన్ ఎలివేటర్ (ధాన్యాగారం) పై అంతస్తులలో మాటువేసిన రష్యన్ డ్రోన్ బృందాన్ని లక్ష్యంగా చేసుకుని ఉక్రెయిన్‌కు చెందిన సుఖోయ్-27 ఫైటర్ జెట్ ఆకాశం నుంచి బాంబును జారవిడిచింది. అది నేరుగా లక్ష్యాన్ని ఛేదించడంతో భారీ పేలుడు సంభవించి, దట్టమైన పొగ, శిథిలాలు గాల్లోకి ఎగిరిపడ్డాయి. ఈ దాడిలో సుమారు 226 కిలోల (500 పౌండ్లు) బరువున్న జీబీయూ-62 జేడీఏఎం-ఈఆర్ ప్రెసిషన్ గ్లైడ్ బాంబును ఉపయోగించినట్లు నిపుణులు గుర్తించారు. ఈ బాంబు జీపీఎస్ సాయంతో తనంతట తానే లక్ష్యాన్ని గుర్తించి ఛేదించగలదు. గ్లైడ్ కిట్ ఉండటం వల్ల, ఫైటర్ జెట్ లక్ష్యానికి చాలా దూరం నుంచే దీనిని ప్రయోగించే వీలుంటుంది. ఉక్రెయిన్ వద్ద ఉన్న పాత సోవియట్ కాలం నాటి మిగ్-29 జెట్‌లలో కూడా పనిచేసేలా ఈ బాంబులను మార్పులు చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇదిలా ఉండగా, రష్యా దళాలు చుట్టుముట్టిన మిర్నోగ్రాడ్ పట్టణం తీవ్రంగా ధ్వంసమైనట్లు అసోసియేటెడ్ ప్రెస్ విడుదల చేసిన డ్రోన్ ఫుటేజీలో స్పష్టంగా కనిపించింది. "ఆ పట్టణాన్ని భూమిపై నుంచి పూర్తిగా తుడిచిపెట్టేందుకు రష్యా ప్రయత్నిస్తోంది" అని ఉక్రెయిన్ సైనికాధికారి ఒలెక్సీ హెూడ్జెంకో ఆరోపించారు. అక్కడి సైనికులకు ఆహారం, నీరు అందించేందుకు ఉక్రెయిన్ గ్రౌండ్-రోబోట్ డ్రోన్‌లను ఉపయోగిస్తోంది.

## చిన్నప్పటి వైరస్‌తో బ్లాడర్ క్యాన్సర్

న్యూఢిల్లీ: చిన్నతనంలో సర్వసాధారణంగా సోకే ఒక వైరస్, భవిష్యత్తులో బ్లాడర్ క్యాన్సర్‌కు కారణం కావచ్చని యూకే పరిశోధకులు తేల్చారు. ఈ వైరస్‌ను ముందుగా గుర్తించి నియంత్రించగలిగితే, బ్లాడర్ క్యాన్సర్‌ను నివారించేందుకు ఒక కొత్త మార్గం దొరుకుతుందని యూనివర్సిటీ ఆఫ్ యార్క్ శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఈ అధ్యయన వివరాలు 'సైన్స్ అడ్వాన్సెస్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధన ప్రకారం బాల్యంలో సోకే 'బీకే వైరస్' ఎలాంటి లక్షణాలు చూపించకుండా కిడ్నీలలో నిద్రాణంగా ఉండిపోతుంది. అయితే, ఈ వైరస్‌ను ఎదుర్కొనేందుకు మన శరీరంలోని రక్షణ వ్యవస్థ చేసే పోరాటమే అసలు సమస్యకు కారణమవుతోంది. వైరస్‌పై దాడి చేసేందుకు ఉద్దేశించిన ఎంజైమ్‌లు, పొరపాటున మన శరీర కణాల డీఎన్ఏనే దెబ్బతీస్తున్నాయి. ఈ ప్రక్రియను పరిశోధకులు 'ఫ్రెండ్లీ ఫైర్'గా అభివర్ణించారు. ఇలా దెబ్బతిన్న డీఎన్ఏ కాలక్రమేణా క్యాన్సర్‌కు దారితీస్తుందని వారు కనుగొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సైమన్ బేకర్ మాట్లాడుతూ.. "సాధారణంగా సర్వైకల్ క్యాన్సర్ వంటి వాటిలో వైరస్ డీఎన్ఏ మన జన్యుపదార్థంతో కలిసిపోయి కణితులు ఏర్పడటానికి కారణమవుతుంది. కానీ, బ్లాడర్ క్యాన్సర్ విషయంలో వైరస్‌పై మన శరీరం జరిపే ప్రతిస్పందనే డీఎన్ఏ మార్పులకు, తద్వారా క్యాన్సర్‌కు కారణమవుతున్నట్లు మా పరిశోధనలో తేలింది" అని వివరించారు. వైరస్ సోకిన కణాలతో పాటు వాటి చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణాల డీఎన్ఏ కూడా దెబ్బతింటున్నట్లు గుర్తించారు. చాలా ఏళ్ల తర్వాత బ్లాడర్ క్యాన్సర్‌ను గుర్తించే సమయానికి కణితులలో వైరస్ ఆనవాళ్లు ఎందుకు కనిపించవనే దానికి ఇది సమాధానం కావచ్చునని బేకర్ తెలిపారు. ప్రస్తుతం ధూమపానం మానేయడం ద్వారా బ్లాడర్ క్యాన్సర్‌ను నివారించాలని సూచిస్తున్నారు. తాజా పరిశోధన ఫలితాలు బీకే వైరస్‌ను నియంత్రించడం ద్వారా ఈ క్యాన్సర్‌ను నివారించేందుకు కొత్త అవకాశాలను కల్పిస్తున్నాయి.

## ఆగని రూపాయి పతనం

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల నేపథ్యంలో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ పతనం ఈ రోజు కూడా కొనసాగింది. బుధవారం చరిత్రలో తొలిసారిగా 90 మార్కును దాటిన రూపాయి, ఇవాళ్టి ట్రేడింగ్‌లో మరో 22 పైసలు నష్టపోయి మరింత బలహీనపడింది. గత ముగింపు 90.19తో పోలిస్తే, గురువారం ఉదయం 90.41 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి వరుసగా పెట్టుబడులను ఉపసంహరించుకోవడం, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడం వంటి కారణాలు రూపాయిపై తీవ్ర ఒత్తిడికి కారణమవుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. బుధవారం ఒక్కరోజే ఎఫ్ఐఐలు రూ. 3,692 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇదే సమయంలో దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (డీఐఐలు) రూ. 4,730 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. రూపాయి విలువ ఇంతలా పడిపోతున్నప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇప్పటివరకు పెద్దగా జోక్యం చేసుకోకపోవడం కూడా పతనానికి ఒక కారణంగా కనిపిస్తోంది. రాబోయే ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్బీఐ ఈ విషయంపై దృష్టి సారించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. స్వల్పకాలంలో ప్రతికూలతలు ఉన్నప్పటికీ, దేశంలో బలమైన ఆర్థిక వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం, కంపెనీల ఆదాయాలు మెరుగుపడటం వంటి సానుకూల అంశాలు మధ్యకాలంలో మార్కెట్‌కు మద్దతుగా నిలుస్తాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




## అఖండ 2 ప్రీమియర్స్ రద్దు



నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ లో వస్తున్న 'అఖండ 2: తాండవం' రిలీజ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. టికెట్ రేట్లు, బెనిఫిట్ షోల అనుమతులతో జోష్ లో ఉన్న ఫ్యాన్స్ కు ఇప్పుడు ఒక చేదు వార్త వినాల్సి వచ్చింది. అనుకున్న ప్లాన్ ప్రకారం జరగాల్సిన ప్రీమియర్ షోస్ విషయంలో ఒక చిన్న ఆటంకం ఎదురైంది. సాంకేతిక కారణాల వల్ల ఈ షోస్ నిలిచిపోయినట్లు మేకర్స్ ప్రకటించారు. డిసెంబర్ 4వ తేదీ సాయంత్రం వేయాలనుకున్న ప్రీమియర్ షోస్ కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల నుంచి అనుమతి వచ్చింది. టికెట్ ధర రూ. 600 అయినా సరే, ఎలాగైనా సినిమాను ముందుగా చూడాలని ఫ్యాన్స్ ఆత్రుతగా ఉన్నారు. అయితే చివరి నిమిషంలో టెక్నికల్ ఇష్యూస్ కారణంగా ఇండియాలో జరగాల్సిన ఈ ప్రీమియర్ షోస్ ను క్యాన్సిల్ చేస్తున్నట్లు 14 రీల్స్ ప్లస్ సంస్థ అధికారికంగా తెలిపింది. 'మేము మా వంతు ప్రయత్నం చేశాం, కానీ కొన్ని విషయాలు మా చేతుల్లో లేవు. అసౌకర్యానికి చింతిస్తున్నాం' అని నిర్మాతలు క్లారిటీ ఇచ్చారు. దీంతో టికెట్లు బుక్ చేసుకున్న అభిమానులు నిరాశకు గురయ్యారు.

## బాలయ్యపై తమిళ మీడియా ప్రశంసలు

పాన్ ఇండియా స్థాయిలో రిలీజవుతున్న తన కొత్త చిత్రం 'అఖండ-2'ను దేశవ్యాప్తంగా గట్టిగానే ప్రమోట్ చేశాడు నందమూరి బాలకృష్ణ. నార్త్ ఇండియాలో జరిగిన ప్రమోషనల్ ఈవెంట్లలో పాల్గొన్నాడు. హిందీ మీడియాకు ఇంటర్వ్యూలిచ్చాడు. అలాగే బుధవారం చెన్నైకి వెళ్లి అక్కడో ఈవెంట్లో పాల్గొన్నాడు. చెన్నైలో మీడియాను కలిసిన సందర్భంగా బాలయ్య చూపించిన సింప్లిసిటీకి, డెడికేషన్‌కు అక్కడి వాళ్లు ఫిదా అయిపోయారు. నిన్న రాత్రి నుంచి తమిళ మీడియా ప్రతినిధులు వరుసగా బాలయ్య మీద పోస్టులు పెట్టి ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇంతకీ అక్కడ బాలయ్య ఏం చేశాడంటే..? బుధవారం మధ్యాహ్నం 11 గంటలకు చెన్నైలో 'అఖండ-2' ప్రమోషనల్ ప్రెస్ మీట్ జరగాల్సింది. ఆ సమయానికి మీడియా ప్రతినిధులు వేదికకు వచ్చేశారు. ఐతే ఉదయం బాలయ్య చెన్నైకి వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు రాగా.. కొన్ని కారణాలతో విమానం ఆలస్యమైంది. ఆయన చెన్నై చేరుకోవడానికి నాలుగు గంటలు ఆలస్యం అయింది. మధ్యాహ్నం రెండున్నర ప్రాంతంలో ఆయన చెన్నైకి చేరుకున్నారు. బాలయ్య వచ్చి ఫ్రెషప్ కావడానికి ఒక హోటల్ గది బుక్ చేశారు. ఆయన కోసం ప్రెస్ ఈవెంట్ దగ్గర ఒక కారవాన్ కూడా ఏర్పాటు చేశారు.



## శోభిత ఆణిముత్యం

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో క్యూట్ జోడీగా పేరు సొంతం చేసుకున్న నాగచైతన్య - శోభిత ధూళిపాళ్ల వైవాహిక బంధంలోకి అడుగుపెట్టి ఈ రోజుకు ఏడాది కావస్తోంది. ఈ నేపథ్యంలోనే పలువురు సెలబ్రిటీలు, అభిమానులు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. తొలి వివాహ వార్షికోత్సవం కావడంతో ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు చందు మొండేటి షేర్ ఆసక్తికర పోస్ట్ చేశాడు. 'నిశ్శబ్దాన్ని మించిన శబ్దం లేదు. ఈ విషయంలో మీరు గొప్ప ఉదాహరణ శోభిత అక్కినేని.. మీరు ఒక ఆణిముత్యం' అంటూ.. చైతూ, శోభిత పెళ్లికి సంబంధించిన ఫోటోని చందు మొండేటి పంచుకున్నారు. ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది.





## గట్టి ప్లాన్‌తోనే కల్కి2లో ప్రియాంక!

ప్రస్తుతం ప్రియాంక చోప్రాతో జక్కన్న ఎలాంటి ఇబ్బంది లేకుండా పని చేసుకుంటున్నాడు. జక్కన్న మాటకు కట్టుబడి ఆమె కూడా పని చేస్తోంది. చెప్పిన టైమ్ కి షూటింగ్ కి వస్తోంది. షూటింగ్ కాస్త ఆలస్యమైనా అడ్జస్ట్ అవుతోంది. ఎక్కడా పనిగంటల గురించి మాట్లాడలేదు. అగ్రిమెంట్ ప్రకారం పారితోషికం తీసుకుంటోంది. ఎప్పటికప్పుడు టీమ్‌తో మింగిల్ అవుతోంది. ఇవన్నీ గమనించిన కల్కి మేకర్స్ లో ప్రియాంకను మించిన ఉత్తమ నటి ఎవరుంటారు? అన్న ఆలోచన మొదలైనట్లు విశ్వసనీయ వర్గాల నుంచి తెలుస్తోంది. కల్కి 2 కంటే ముందుగా వారణిసి రిలీజ్ అవుతుంది. ప్రియాంకను తీసుకుంటే గనుక ఆ హిట్ కల్కి 2 కి కలిసొస్తుంది. మార్కెట్ పరంగానూ మరింత మెరుగ్గా ఉంటుంది.

## కంటెంట్ ఉన్నా లేకున్నా బికినీ




బాలీవుడ్ హీరోయిన్స్ ఎప్పటికప్పుడు సినిమాల్లో బికినీల్లో సందడి చేస్తుంటారన్న విషయం తెలిసిందే. వెకేషన్స్ లో బికినీలు వేసుకుని చిల్ అవుతూ పిక్స్ షేర్ చేసే ముద్దుగుమ్మలు.. అప్పుడప్పుడు సినిమాల్లో కూడా వాటిలో కనిపిస్తుంటారు. అందుకు సంబంధించిన గ్లింప్సెస్, వీడియోస్ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతుంటాయి. ఇప్పుడు యంగ్ బ్యూటీ అనన్య పాండే బికినీ లుక్ కూడా అలాగే ట్రెండ్ అవుతోంది. తు మేరీ మై తేరా మై తేరా తు మేరీ మూవీలో బికినీలో సందడి చేయనున్న అమ్మడికి సంబంధించిన లుక్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. లుక్ అదిరిపోయిందని, సూపర్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయితే, సినిమాలో హీరోయిన్ బికినీ వేసుకుంటే.. థియేటర్స్ కు ఆడియన్స్ వెళ్లి చూస్తారంటే పొరపాటే. ఎవరో కొందరు వెళ్లి లుక్స్ ను ఎంజాయ్ చేస్తారు. కానీ అందరూ తరలివెళ్లాలంటే.. సినిమాలో కంటెంట్ ఉంటేనే.. పాజిటివ్ టాక్ వస్తేనే సాధ్యమవుతుందంటూ మరో వర్గం కామెంట్లు చేస్తోంది.

## 'పీఆర్ టీం లేదు' అంటూ శ్యామలీ దే కౌంటర్



ప్రముఖ స్టార్ హీరోయిన్ సమంత.. బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ రాజ్ నిడిమోరు ఇన్ని రోజులు రూమర్డ్ జంటగా పేరు సొంతం చేసుకుని.. ఇప్పుడు ఎట్టకేలకు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. సమంత , నాగచైతన్య నుంచి విడిపోయిన తర్వాత.. ఏడాదికి రాజ్ కూడా తన భార్య శ్యామలీ దేకి విడాకులు ఇచ్చారు. అప్పట్లో ఈ విషయాలు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. వీరి పెళ్లి గురించి శ్యామలీ నేరుగా స్పందించలేదు కానీ తాజాగా పంచుకున్న ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ లో.. 'ఇప్పుడు ఎవరైనా డ్రామా అలాగే బ్రేకింగ్ న్యూస్ కోసం ఎదురు చూస్తున్నట్లయితే దానిని మీరు ఇక్కడ ఎప్పటికీ కనుగొనలేరు. దయచేసి ఇలాంటి వాటికోసం వెతక కండి. ముఖ్యంగా అలా బ్రేకింగ్ కోసం ఎదురు చూసేవారు దయచేసి నా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను ఓపెన్ చేయకపోవడమే మంచిది. శ్రద్ధ, మీడియా కవరేజ్, ప్రత్యేక ఇంటర్వ్యూలు, బ్రాండ్ ప్రమోషన్లు లాంటివి చేయడం లేదు. ముఖ్యంగా సానుభూతి కోసం అస్సలు చూడడం లేదు. ఇక ఎవరినైనా నిందించడానికి కూడా ఇక్కడ ప్రయత్నం చేయడం లేదు' అంటూ రూమర్స్ క్రియేట్ చేయాలని చూస్తున్నవారికి ఇన్ డైరెక్ట్ గా గట్టి కౌంటర్ ఇచ్చింది శ్యామలీ.

## అక్కడే సగం కమిట్‌మెంట్

హీరోయిన్ ఎవరైనా కథ, అందులో తన పాత్ర తెలియకుండా ఏ సినిమాకు కమిట్ అవ్వదు. అలా కమిట్ అయిందంటే అది దర్శకులపై తనకున్న నమ్మకం మాత్రమే కారణమవుతుంది. కొన్ని సందర్భాల్లో దర్శక, నటుల మధ్య ఉన్న ర్యాపో కారణంగానూ ఇలాంటి సన్నివేశం కనిపిస్తుంది. తాజాగా హైదరాబాద్ బ్యూటీ అతిది రావు హైదరీ కూడా అంతేనంటోంది. పాత్రల కంటే నిర్మాతలు, దర్శకులే తనను ఎక్కువగా ఉత్సాహపరుస్తారంది. ఎందుకంటే తానెప్పుడు దర్శకుల బిడ్డనే అంటుంది. వాళ్ల అభిరుచికి తగ్గట్టు ఉండటమే తన పని అంది. పాత్ర గురించి తెలుసుకోనంది. ఏం జరుగుతుందో తెలియని చీకటి గదిలోకి వెళ్తోన్న చిన్న పిల్లాడిలా తాను ఉండాల నుకుంటుంటానంది. తాను ఏ పాత్ర ఎంచుకున్నా? అందులో సీతాకోక చిలుకలా ఎగరాలనుకుంటుంటానంది. ఏ సినమాకు సంతకం చేసినా? పాత్రల పరంగా అలా ఉండాలి? ఇలా ఉండాలి? అని ఎలాంటి సలహాలు ఏ దర్శక, రచయితకు ఇవ్వనని, వారు అప్రోచ్ అయ్యే విధానంతోనే సగం కమిట్ మెంట్ జరిగిపోతుందంది.





# సెర్చ్‌లో కోహ్లీ, సూర్యవంశీ టాప్

భారత్‌లో అత్యధికంగా సెర్చ్ చేసిన ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో నిలిచాడు. మరే ఇతర అంతర్జాతీయ క్రీడాకారుడు కూడా కోహ్లీని అందుకోలేకపోయారు. సెర్చ్ పాపులారిటీలో మరోసారి అగ్రస్థానంలో నిలిచిన కోహ్లీ.. భారత అత్యంత ప్రభావవంతమైన క్రికెటర్‌గా నిలిచాడు. భారత్‌లో అత్యధికంగా సెర్చ్ చేసిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ తర్వాత వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. ఈ 14 ఏళ్ల కుర్రాడు విధ్వంసకర బ్యాటింగ్‌తో టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారాడు. మహిళా క్రికెటర్లు జెమీమా రోడ్రిగ్స్, స్మృతి మంధానలు తర్వాతి స్థానంలో నిలిచారు. మహిళల వన్డే ప్రపంచకప్ విజయంతో ఈ ఇద్దరి పేర్లు దేశవ్యాప్తంగా మారుమోగింది. అయితే ఈ సెర్చ్‌ల వివరాలను గూగుల్ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. అటు.. ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది అత్యధికంగా సెర్చ్ చేసిన క్రీడాకారుల జాబితాలో పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రోనాల్డో అగ్రస్థానంలో నిలిచాడు. తాజాగా విడుదలైన ఓ నివేదిక ప్రకారం అత్యధికంగా 76 దేశాల్లో రొనాల్డో గురించి నెటిజన్లు సెర్చ్ చేశారు.







# స్టార్క్ మళ్లీ..!

## ఇంగ్లిష్ బ్యాటర్లు బెంబేలు.. 6 వికెట్లు తీసిన స్పీడ్‌స్టర్

## జో రూట్ అద్భుత సెంచరీ.. 325/9 వద్ద ఇంగ్లండ్




యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న పింక్ బాల్ రెండో టెస్ట్‌లో జో రూట్ అజేయ శతకంతో చెలరేగాడు. ఆస్ట్రేలియా గడ్డపై జోరూట్‌కు ఇదే తొలి శతకం కావడం గమనార్హం. టెస్ట్‌ల్లో ఇప్పటి వరకు 40 శతకాలు సాధించిన జోరూట్.. ఆస్ట్రేలియాపై మూడెంకల స్కోర్ అందుకునేందుకు ఇన్నాళ్లు నిరీక్షించాడు. కెరీర్‌లో లోటుగా మారిన ఈ సెంచరీని సాధించేందుకు జోరూట్‌కు తాజా పర్యటనలో మూడు ఇన్నింగ్స్‌ల సమయం పట్టింది. తొలి టెస్ట్‌లో దారుణంగా విఫలమైన జోరూట్.. పింక్ బాల్ టెస్ట్‌లో తన ట్రేడ్ మార్క్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. మిచెల్ స్టార్క్ ధాటికి ఆదిలోనే బెన్ డకెట్, ఓలీ పోప్ డకౌటవ్వగా.. జాక్ క్రాలీ(76)తో కలిసి జోరూట్ జట్టును ఆదుకున్నాడు. మూడో వికెట్‌కు 107 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. జాక్ క్రాలీ వెనుదిరిగినా.. హ్యారీ బ్రూక్(31), బెన్ స్టోక్స్(19), విల్ జాక్స్(19), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్)ల సాయంతో విలువైన భాగస్వామ్యాలను నెలకొల్పాడు. ఈ క్రమంలో 83 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న జోరూట్.. 181 బంతుల్లో శతకాన్ని పూర్తి చేశాడు. ఈ భారీ ఇన్నింగ్స్‌తో ఆస్ట్రేలియా గడ్డపై 1000 పరుగుల మార్క్‌ను అందుకున్నాడు. ఇప్పటి వరకు ఆసీస్ గడ్డపై 30 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 1006



పరుగులు చేశాడు. ఇందులో తాజా సెంచరీతో పాటు 9 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో జోరూట్‌కు ఇది 22వ సెంచరీ. ఇప్పటికే ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్న జోరూట్.. తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నాడు. మరే బ్యాటర్ కూడా అతనికి దరిదాపుల్లో లేడు. డబ్ల్యూటీసీ చరిత్రలో 129 ఇన్నింగ్స్‌లు ఆడిన జోరూట్ 22 శతకాలు చేయగా.. స్టీవ్ స్మిత్ 13, మార్నస్ లబుషేన్ 11, కేన్ విలియమ్సన్ 11, శుభ్‌మన్ గిల్ 10 సెంచరీలతో తర్వాతి స్థానంలో నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక సెంచరీలు బాదిన బ్యాటర్ల జాబితాలో జోరూట్(59లి) అగ్రస్థానంలో కొనసాగతుండగా.. అలిస్టర్ కుక్(38), కెవిన్ పీటర్సన్(32), గ్రహమ్ కోచ్(28), ఆండ్రూ స్ట్రాస్(27) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీలతో సచిన్ టెండూల్కర్ అగ్రస్థానంలో ఉండగా.. విరాట్ కోహ్లీ(84), రికీ పాంటింగ్(71), కుమార సంగక్కర(63), జాక్వాస్ కల్లీస్(62), జోరూట్(59లి) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. జోరూట్ సెంచరీతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 74 ఓవర్లలో 9 వికెట్లకు 325 పరుగులు చేసింది. క్రీజులో జోరూట్(135 బ్యాటింగ్), జోఫ్రా ఆర్చర్(32 బ్యాటింగ్) ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/71) ఆరు వికెట్లు తీయగా.. మైఖేల్ నెజర్, స్కాట్ బోలాండ్ తలో వికెట్ తీసారు.



# 500 రన్స్ కూడా సరిపోవు: క్రిష్ శ్రీకాంత్

భారత బౌలర్లపై మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. సౌతాఫ్రికాతో రెండో వన్డేలో టీమిండియా ఓటమికి పేలవ బౌలింగే కారణమని చెప్పాడు. ఇలా బౌలింగ్ చేస్తే 500 పరుగులు చేసినా సరిపోవని అభిప్రాయపడ్డాడు. బుమ్రా గైర్హాజరీలో టీమిండియా రాణించలేకపోతుందని, హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ నిలకడగా రాణించలేకపోతున్నారని అభిప్రాయపడ్డాడు. తాజా ఫలితంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన క్రిష్ శ్రీకాంత్.. తమిళ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని వన్డేల్లో ఎందుకు ఆడించడం లేదని ప్రశ్నించాడు. 'మరో 20 పరుగులు చేయాల్సింది అనడం దురాశే. 358 పరుగులకు మించి ఏం కావాలి. ఇంకా 20 పరుగులు చెయాల్సిందని అంటే.. 500 పరుగులు కూడా సరిపోవు. భారత ఆటగాళ్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. కేఎల్ రాహుల్ చివర్లో గొప్పగా ఆడి విలువైన పరుగులు అందించాడు. 27 బంతులాడిన జడేజా కూడా 30-35 పరుగులు చేసుంటే భారత్ మరో 10 పరుగులు అదనంగా చేసిది. అయితా 358 భారీ స్కోర్. మంచు టీమిండియా అవకాశాలను దెబ్బతీసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ అదనంగా 10 పరుగులు చేస్తే బాగుండేది. రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్ బాగా ఆడితే గెలిచేది అనుకోవడం సరికాదు'అని చెప్పుకొచ్చాడు.



# వైజాగ్‌లో టీమిండియా రోహిత్ చెలరేగేనా?

రాయ్‌పూర్ వన్డేలో కంగుతిన్న భారత జట్టు మూడో వన్డే కోసం వైజాగ్ చేరుకుంది. కెప్టెన్ కేఎల్ రాహుల్ బృందం గురువారం విశాఖ నగరంలో అడుగుపెట్టింది. విమానాశ్రయంలో టీమిండియా ఆటగాళ్లకు ఘన స్వాగతం లభించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే మ్యాచ్ కావడంతో భారత క్రికెటర్లు శుక్రవారం నెట్స్ సెషన్‌లో చెమటోడ్చునున్నారు. శనివారం స్థానిక ఏసీఏ-వీడీసీఏలో ఉత్కంఠ పోరు అభిమానులను అలరించనుంది. మరి, ఈ స్టేడియంలో అత్యధిక స్కోర్ ఎంతో తెలుసా? మూడు వన్డేల సిరీస్‌లో చివరి మ్యాచ్ కోసం భారత్, దక్షిణాఫ్రికా జట్లు వైజాగ్ చేరుకున్నాయి. చెరొక మ్యాచ్ గెలుపొందడంతో సిరీస్ పట్టేసేది ఎవరు? అనే ఉత్కంఠ నెలకొంది. తొలి రెండు వన్డేల్లో భారీ స్కోర్లు నమోదవ్వడంతో వైజాగ్ వికెట్ ఎలా ఉండనుంది? అనేది ఆసక్తి రేపుతోంది. గత రికార్డులు చూస్తే.. ఈ స్టేడియంలో అత్యధిక స్కోర్ కొట్టింది భారత జట్టే. 2007 ఫిబ్రవరి 17న శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల నష్టానికి 354 పరుగులు చేసింది టీమిండియా. రోహిత్ శర్మ 148తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రెండో అత్యధిక స్కోర్..351/4. మూడో అత్యధికం.. 350/6. సో.. గత రెండు మ్యాచుల్లో మాదిరిగానే మూడో వన్డేలోనూ 350 ప్లస్ స్కోర్ ఖాయమనిపిస్తోంది.

# నర్సరీ బాలుడికి ఫిడే రేటింగ్

చదరంగం ఆటలో భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్లకు కొదవ లేదు. విశ్వనాథన్ ఆనంద్ నుంచి మొదలు.. డి.గుకేశ్, అర్జున్ ఎరిగేసి, యువతరంగం దివ్యా దేశ్‌ముఖ్ వరకూ అందరూ అంతర్జాతీయంగా ఘనులే. 64 గడుల ఈ ఆటలో ఇప్పుడు ఓ మూడేళ్ల పిల్లాడు ప్రభంజనం సృష్టిస్తున్నాడు. నర్సరీ చదివే వయసులోనే ఫిడే రేటింగ్ సాధించి దిగ్గజాలను ఫిదా చేస్తున్న చిన్నారి పేరు సర్వజ్ఞ సింగ్ కుష్వహ. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ బాలుడి ప్రతిభకు ఎవరైనా హ్యాట్సాఫ్ అనాల్సిందే. మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు కొనిచ్చిన చెస్ బోర్డు ఇప్పుడు సర్వజ్ఞ్‌ను రికార్డులు నెలకొల్పేలా చేయడం విశేషం. మూడేళ్ల వయసున్న పిల్లలు ఫోన్లలో బొమ్మలు చూడడం.. ఇంట్లోని టాయ్స్‌తో ఆడుకోవడం వంటివి చేస్తారు. మొదట్లో సర్వజ్ఞ కూడా అలానే ఫోన్ కోసం మారాం చేసేవాడు.

# బ్రెవిస్ బ్యాటింగ్ మైండ్ బ్లోయింగ్

సౌతాఫ్రికా యువ బ్యాటర్, చెన్నై సూపర్ కింగ్స్ హిట్టర్ డెవాల్డ్ బ్రెవిస్‌పై టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. భారత్‌తో రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో అతని బ్యాటింగ్ అద్భుతంగా ఉందని కొనియాడాడు. కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్ శతకాలతో చెలరేగినా తనను డెవాల్డ్ బ్రెవిస్ బ్యాటింగ్ ఆకట్టుకుందని అశ్విన్ ట్వీట్ చేశాడు. అతని బ్యాటింగ్ బాక్సాఫీస్ హిట్ అని ఎక్స్ వేదికగా పేర్కొన్నాడు. 'బ్రేవ్ బాల్ ఈజ్ బాక్సాఫీస్'అని ట్వీట్ చేశాడు. అతని ఫియర్‌లెస్ గేమ్ అమోఘమని, అద్భుతమైన సినిమాను చూసినట్లుందని పేర్కొన్నాడు.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శుక్రవారం 5-12-2025 | www.evarthalu.com



# నేలమ్మను.. పీల్చి పిప్పి చేసి!

**భారతదేశంలో వ్యవసాయం కేవలం జీవనోపాధి మార్గం కాదు, అది ఒక సంస్కృతి, జీవన విధానం. తరతరాలుగా మన రైతులు నేలను తల్లిగా భావించి పూజించారు. కానీ, ఆధునిక వ్యవసాయ పద్ధతుల పేరుతో, ముఖ్యంగా అధిక దిగుబడుల ఆశతో విచక్షణారహితంగా రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరగడం వల్ల నేడు మన "నేలమ్మ తల్లి" తన సారవంతమైన శక్తిని కోల్పోయి, నిస్సారంగా మారుతోంది. ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు, మన భవిష్యత్ ఆహార భద్రతకు, ప్రజారోగ్యానికి పెను ప్రమాదం.**

1960లలో ఆహార కొరతను అధిగమించడానికి ప్రవేశపెట్టబడిన హరిత విప్లవం, అధిక దిగుబడినిచ్చే వంగడాలు, నీటిపారుదల, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని ప్రోత్సహించింది. ఈ పద్ధతులు తక్షణ ఫలితాలనిచ్చాయి, దేశాన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వావలంబన సాధించేలా చేశాయి. అయితే, ఈ విజయం వెనుక దాగి ఉన్న పర్యావరణ, ఆరోగ్య మూల్యం ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోంది. రసాయన ఎరువులను దీర్ఘకాలం వాడటం వల్ల నేల నాణ్యత తగ్గిపోతుందని, కాలక్రమేణా పంట దిగుబడి కూడా తగ్గుతోంది. రసాయన ఎరువులు ముఖ్యంగా నత్రజని, భాస్వరం, పొటాషియం వంటి స్థూల పోషకాలను మాత్రమే అందిస్తాయి, కానీ నేలకు అత్యంత ముఖ్యమైన సేంద్రీయ పదార్థాన్ని అందించవు. నేలలో సేంద్రీయ పదార్థం తగ్గడం వల్ల నీటిని నిలుపుకునే సామర్థ్యం, నేల నిర్మాణం దెబ్బతింటాయి. నేల ఆరోగ్యానికి అవసరమైన సూక్ష్మజీవులు, వానపాములు రసాయనాల ప్రభావంతో నశించిపోతున్నాయి. ఇది నేల సహజ పోషక చక్రాన్ని దెబ్బతీస్తోంది. నత్రజని ఆధారిత ఎరువులను అధికంగా వాడటం వల్ల నేల ఆమ్లత్వం పెరుగుతోంది, ఇది పంటలకు హాని కలిగిస్తోంది. నేల ద్వారా భూగర్భ జలాలు, ఉపరితల నీటి వనరులు కలుషితమవుతున్నాయి. ఈ పోషకాలు నీటి వనరులలో చేరి, హానికరమైన ఆల్గల్ బ్లూమ్స్‌కు కారణమవుతాయి, ఇది జలచరాలకు ప్రాణాంతకం. పురుగుమందుల అతి వినియోగం పర్యావరణంలో, ఆహార గొలుసులో విషపూరిత అవశేషాలను పేరుకుపోయేలా చేస్తుంది. ఇది కేవలం కీటకాలను మాత్రమే కాకుండా, పరాగసంపర్కానికి తోడ్పడే తేనెటీగలు వంటి కీటకాలను కూడా చంపుతుంది. మానవులలో, పురుగుమందుల అవశేషాలు క్యాన్సర్, నరాల సంబంధిత సమస్యలు, పునరుత్పత్తి సమస్యలు వంటి దీర్ఘకాలిక ఆరోగ్య ప్రభావాలకు దారితీయవచ్చు. ఈ పెను ప్రమాదం నుండి మన 'నేలమ్మ తల్లిని' మన భవిష్యత్తు తరాలను కాపాడుకోవాలంటే, మనం తక్షణమే స్థిరమైన, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులకు మారాలి. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా కంపోస్ట్, పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులను వాడాలి. నేల పరీక్షల ఆధారంగా సేంద్రియ, రసాయనిక ఎరువులను సమతుల్యంగా, అవసరమైన మేరకు మాత్రమే వినియోగించాలి. పురుగుమందులపై ఆధారపడకుండా, జీవ నియంత్రణ పద్ధతులు, పంట మార్పిడి వంటి సహజ పద్ధతులను ప్రోత్సహించాలి. రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలి. ప్రకృతికి విరుద్ధంగా సాగే వ్యవసాయం తాత్కాలిక లాభాలను ఇవ్వొచ్చు కానీ, దీర్ఘకాలంలో మన ఉనికికే ప్రమాదం. నేల ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం, దాని సహజ శక్తిని కాపాడటం మన సామాజిక బాధ్యత. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తేనే మనం ఆరోగ్యకరమైన పంటలను పండించగలం, మన నేలమ్మ తల్లికి పునర్జీవం పోయగలం.

**- అలేఖ్య కట్కం**

# కోతులే సమస్య.. కారణమెవరు?



**గ్రామాల్లో కోతుల బెడద తీవ్రమైన సామాజిక, ఆర్థిక సమస్యగా మారింది. అడవుల విస్తీర్ణం తగ్గడం, ఆహార వనరులు కొరవడటంతో కోతులు జనావాసాల్లోకి చొచ్చుకువస్తున్నాయి. తెలంగాణతో పాటు దేశంలోని అనేక గ్రామాలు, పట్టణాల్లో కోతుల బెడద విపరీతంగా పెరిగిపోయింది. ఒకప్పుడు అడవులకే పరిమితమైన వానరసేన, ఇప్పుడు పల్లె ప్రజల దైనందిన జీవితాన్ని, రైతుల పంటలను నాశనం చేస్తూ పెద్ద సమస్యగా మారింది. కోతులు ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందరవందర చేయడం, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, చివరకు మనుషులపై, ముఖ్యంగా చిన్న పిల్లలపై దాడులకు పాల్పడటం భయాందోళన కలిగిస్తోంది.**

ఈ సమస్యకు ప్రధాన కారణం మానవ తప్పిదమే. అటవీ సంరక్షణ లోపించడం, పండ్ల చెట్లను నరికివేయడం, జనావాసాలు అడవులకు దగ్గరగా విస్తరించడం వంటి కారణాల వల్ల కోతుల సహజ ఆవాసాలు, ఆహారం దెబ్బతిన్నాయి. దీంతో అవి ఆకలితో పట్టణాలకు, గ్రామాలకు వస్తున్నాయి. ప్రజలు తమ సమస్యను పరిష్కరించుకోవడానికి ఎలుగుబంటి వేషాలు వేయడం, కొండెంగల బొమ్మలు/శబ్దాలు ఉపయోగించడం, లేదా సొంత ఖర్చులతో కోతులను పట్టేవారిని నియమించుకోవడం వంటి తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. అయితే ఇవి శాశ్వత పరిష్కారాలు కావు. ప్రభుత్వాలు తక్షణ, దీర్ఘకాలిక ప్రణాళికలతో ఈ సమస్యను పరిష్కరించాలి. అడవుల్లో కోతులకు సరిపడా ఆహారం లభించేలా పండ్ల చెట్లను విరివిగా పెంచాలి. హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో చేపట్టిన విధంగా కోతులకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు నిర్వహించే కార్యక్రమాలను ఇతర రాష్ట్రాల్లోనూ అమలు చేయాలి. సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల నుంచి పట్టుకున్న కోతులను తగిన వసతులతో (నీరు, ఆహారం, నీడ) ప్రత్యేక కేంద్రాలకు తరలించి సంరక్షించాలి. రైతులు అల్లం, పసుపు, లెమన్‌గ్రాస్ వంటి కోతులు ఇష్టపడని పంటల సాగుకు మారడం లేదా సోలార్ ఫెన్సింగ్, నైలాన్ వలలు వంటి రక్షణ చర్యలు చేపట్టడం ద్వారా నష్టాన్ని తగ్గించుకోవచ్చు. శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అటవీ శాఖ, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో సమన్వయంతో కూడిన చర్యలు తక్షణావసరం. లేదంటే, ఈ 'వానర' పీడ పల్లె ప్రజలను, రైతులను మరింత ఉక్కిరిబిక్కిరి చేయడం ఖాయం. అందుకే ఈ సమస్యను తీర్చిన వారికే సర్పంచ్ ఎన్నికల్లో ఓటేస్తామని ప్రజలు తేల్చిచెప్తున్నారు.

**- అంజయ్య కోరుకొండ, రైతు, కరీంనగర్**



# పంచాయతీకి నిధులెట్ల?

**గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే గ్రామ పంచాయతీలు తమ కార్యకలాపాలను నిర్వహించడానికి, మౌలిక సదుపాయాలను కల్పించడానికి వివిధ మార్గాల ద్వారా నిధులను సేకరిస్తాయి. ఈ నిధుల ప్రవాహాన్ని ప్రధానంగా మూడు విభాగాలుగా విభజించవచ్చు. ఒకటి.. సొంత వనరుల ద్వారా ఆదాయం. గ్రామ పంచాయతీలు తమ పరిధిలో సొంతంగా పన్నులు, పన్నుయేతర ఆదాయాలను విధించి, సేకరిస్తాయి.**

ఇంటి పన్ను (గృహ పన్ను), వృత్తి పన్ను, మార్కెట్లు, సంతలపై పన్నులు, ప్రకటనలపై పన్ను, వాహన పన్నులో వాటా, భూమి శిస్తులో వాటా వంటివి ప్రధాన పన్ను ఆదాయ వనరులు. నీటి సరఫరా రుసుములు (వాటర్ సెస్), జనన/మరణ ధృవపత్రాల నమోదు రుసుములు, లైసెన్సు ఫీజులు, పంచాయతీ ఆస్తులైన భవనాలు, ఖాళీ స్థలాలు, చెరువులు, కబేళాల లీజు లేదా అద్దె ద్వారా వచ్చే పన్నేతర ఆదాయం ఇందులో భాగం. రెండోది.. గ్రామ పంచాయతీలకు నిధులు సమకూర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు అత్యంత కీలకమైన వనరు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు అందుతాయి. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేస్తుంది. ఈ నిధులను ప్రాథమిక సేవలు (నీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్ల నిర్వహణ) కోసం ఉపయోగిస్తారు. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు కూడా వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన సొంత ఆర్థిక సంఘం సిఫార్సుల ఆధారంగా పంచాయతీలకు గ్రాంట్లను కేటాయిస్తుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ వంటి వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు ప్రత్యేక నిధులు అందుతాయి. మూడోది.. ఇతర వనరులు. గ్రామస్థులు, ప్రవాస భారతీయులు లేదా స్వచ్ఛంద సంస్థల నుంచి విరాళాలు, సామాజిక పనులకు సహకారం రూపంలో కూడా నిధులు అందుతాయి. గ్రామాల పరిధిలో ఉన్న కర్మాగారాలు లేదా పరిశ్రమల నుండి సీఎస్ఆర్ నిధులు కూడా అభివృద్ధి కార్యక్రమాలకు మంజూరవుతాయి. ఈ-గ్రామ్ స్వరాజ్ వంటి ప్రభుత్వ పోర్టల్‌లలో నమోదు చేసి, పారదర్శకంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే, కొన్ని సందర్భాల్లో నిధుల కొరత లేదా సకాలంలో నిధులు విడుదల కాకపోవడం వంటి సమస్యలు సర్పంచులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**- సుధాకర్ పొన్నాల, టీచర్, నాగర్ కర్నూల్**

## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.